News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :90 | ఖమ్మం | శనివారం, మే 17, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## వ్యాపారుల అక్రమాలపై పీడీ చట్టం

- నకిలీ ఎరువులు, విత్తనాలపై అప్రమత్తంగా ఉండండి
- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి




రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 'విత్తనాలు, ఎరువుల అక్రమ దందాపై అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించాలి. రాష్ట్ర సరిహద్దుల్లో నిరంతర నిఘా పెట్టండి' అని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు.

**విడి విత్తనాలు కొనొద్దు...**

"అన్నదాతలూ... నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. ప్యాకెట్లు తప్ప విడి విత్తనాలు కొనవద్దు. విత్తన ప్యాకెట్లు కొనే సమయంలో తప్పకుండా బిల్లును తీసుకోండి. పంట కాలం ముగిసేంత వరకు ఖాళీ ప్యాకెట్‌లను భద్రపరుచుకోవాలి. జిల్లాల్లో సరిపడా అన్ని కంపెనీల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో, రాష్ట్రంలో వానలు ముందుగానే కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ చేసిన సూచనలను గమనించాలి. సరైన సమయంలో పంటలు వేసుకోవాలి" అని సీఎం రేవంత్ సూచించారు. 'వానాకాలం పంటల సాగుకు వ్యవసాయ శాఖ అన్ని విధాలుగా సన్నద్ధం కావాలి. విత్తనాలు, ఎరువులకు సంబంధించి

వివరాలు 2లో..



# హైదరాబాద్‌లో డేటా సిటీ

## త్వరలో ఏర్పాటు చేయబోతున్నాం

- ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ లైన్లు వేయాలి
- జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రయోగాత్మకంగా స్మార్ట్‌పోల్స్ ఏర్పాటు
- 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు రాష్ట్ర విద్యుత్ డిమాండ్
- విద్యుత్ శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

"గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సంవత్సరం విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగినా ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన సరఫరాతో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. నిరుటితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ ఈ ఏడాది 9.8% అదనంగా పెరిగింది. రోజూవారీ గరిష్ఠ డిమాండు ఈ ఏడాది మార్చిలో అత్యధికంగా 17,162 మెగావాట్లకు చేరింది. రాష్ట్ర రోజువారీ విద్యుత్ డిమాండు 2025-26లో 18,138 మెగావాట్లకు, 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు పెరుగుతుంది. అందుకు అనుగుణంగా ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేయాలి" అని విద్యుత్ సంస్థలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో శుక్రవారం విద్యుత్‌శాఖపై ఆయన సమీక్షించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డిస్కంల సీఎండీలు

వివరాలు 2లో..

### మళ్లీ పంజా విసురుతున్న కరోనా..

## హాంకాంగ్, సింగపూర్‌లో మళ్లీ విజృంభిస్తున్న కేసులు

- ఆసియాలో మళ్లీ కోవిడ్ అలజడి.. పలు దేశాల్లో పెరుగుతున్న కేసులు
- హాంగ్‌కాంగ్‌లో ఏడాది గరిష్ఠానికి చేరిన కేసులు.. మరణాలు
- సింగపూర్‌లోనూ భారీగా పెరిగిన కేసులు.. ఆసుపత్రి చేరికలు
- ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గడమే కారణమని ఆరోగ్య నిపుణుల అంచనా
- వేసవిలోనూ వైరస్ వ్యాప్తి చెందుతుండటంతో అప్రమత్తత అవసరం

వివరాలు 2లో..



## సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానమాచరించిన డిప్యూటీ సీఎం భట్టి దంపతులు



కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు అట్టహాసంగా కొనసాగుతు న్నాయి. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు శుక్రవారం (మే 16) సరస్వతి పుష్కరాలల్లో పుణ్యస్నానం చేశారు. పుష్కరాలకు వెళ్లిన భట్టి దంపతులకు వేద పండితులు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం త్రివేణి సంఘమంలో భట్టి దంపతులు పుణ్యస్నానం

వివరాలు 2లో..

## కేటీఆర్ కాదు ..సైకో రామ్.. కల్లుతాగిన కోతి నిప్పులు తొక్కినట్టుంది

- వీళ్ల మాటలెవరూ వింటలేరని సోనియాకు లేఖ రాశారు
- మీ తెలివి తేటలు దరిద్రపు పనులకు వాడే బదులు.. రాష్ట్రానికి సలహాలు ఇవ్వచ్చు కదా?
- రబ్బరు చెప్పులతో ఉన్నోళ్ళు.. కుబేరులయ్యిండ్రు
- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ కోడిగుడ్డు మీద ఈకలు పీకే రాజకీయం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఇవాళ గాంధీ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ ఓ సైకో రామ్ అని మండిపడ్డారు. కల్లుతాగిన కోతి నిప్పులు తొక్కినట్టుగా ఆయన వాలకం ఉందన్నారు. మిస్ వరల్డ్ పోటీ కంటెస్టెంట్లకు ఎవరో ఒకరు అత్యుత్సాహం తో కాళ్లు తుడిచి ఉంటారని, దానికి పెద్ద రాద్ధాంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు. వీళ్ల మాటలు ఎవరూ వినడం లేదనే సోనియా గాంధీకి లేఖ రాశారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం పేరుతో రాజకీయం చేసి రబ్బరు చెప్పుల్లో తిరిగిన వారు ఇప్పుడు కుబేరులయ్యారని అన్నారు. ఇప్పుడు తెలంగాణ గురించి మాట్లాడటమే మానేశారని విమర్శించారు. రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం అందుతున్నాయా.? వడ్లు కొంటున్నారా..? లేదా..? అనేది తెలుసుకోవడం మానేసి కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని ఫైర్ అయ్యారు. వాళ్ల తెలివి తేటలను దరిద్రపు పనులకు వాడే బదులు రాష్ట్రానికి సలహాలు ఇచ్చేందుకు వినియోగించాలని సూచించారు. పదేండ్లు పాలించిన బీఆర్ఎస్ నాయకత్వానికి వాళ్ల ఇంటి ఆడబిడ్డ తప్ప వేరే ఆడపడుచులు కనిపించలేదా... అని ప్రశ్నించారు. టీఆర్ఎస్ లీడర్లు ప్రతిపక్ష పాత్ర కూడా పోషించలేక పోతున్నారని అన్నారు.

## ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం... ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్

- మూడు రోజుల సిట్ విచారణ అనంతరం అరెస్టు చేసిన అధికారులు
- ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- ఈ కేసులో ఏ31, ఏ32 నిందితులుగా ఉన్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి

ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యా ప్తులో నేడు కీలక పరిణామం చోటుచేసు కుంది. సుదీర్ఘ విచార ణ అనంతరం, నాటి ముఖ్య మంత్రి కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డితో పాటు, అప్పటి సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించిన సిట్ అధికారులు, మద్యం కుంభకోణంలో వీరి ప్రమేయంపై స్పష్టత వచ్చిన తర్వాత ఈ సాయంత్రం అరెస్టు చేసినట్లు వెల్లడించారు.



వివరాలు 2లో..

## మద్యం స్కాంలో కసిరెడ్డి వాంగ్మూలానికి కోర్టు గ్రీన్ సిగ్నల్...

### కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం



- ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి ముందస్తు బెయిల్ సుప్రీంకోర్టులో డిస్మిస్
- ఇద్దరినీ అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్న పోలీసులు
- గోవిందప్ప బాలాజీ కస్టడీ పిటిషన్‌పై విచారణ 19కి వాయిదా
- మద్యం కేసులో ఈడీ ఎంట్రీ, కసిరెడ్డి వాంగ్మూలానికి పిటిషన్

వివరాలు 2లో..

## తుర్కియేతో తెంచేసుకుందాం

- వాణిజ్య బంధాలపై జీజేసీ - కెయిట్ డిమాండ్
- తుర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో లీజు వద్దన్న ఎయిరిండియా



దిల్లీ: మనదేశంలో మారణకాండకు పాల్పడిన తీవ్ర వాదుల పీచమణిచేందుకు పాకిస్థాన్‌పై మనదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించిన తుర్కియే దేశంపై భారత్‌లోని అన్ని వర్గాలు మండిపడుతున్నాయి. ప్రపంచ దేశాల్లో అత్యధికం మనదేశానికి మద్దతు పలుకగా, ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్‌బైజాన్ మాత్రం పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలు తెంచుకోవాలని దేశీయ వర్గాలు నిర్ణయించాయి.

వివరాలు 2లో..

## వల్లభనేని వంశీకి 14 రోజుల రిమాండ్

- వల్లభనేని వంశీకి ఈ నెల 29 వరకు రిమాండ్
- నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో నూజివీడు కోర్టు ఉత్తర్వులు
- వంశీ అనుచరుడు మోహన్ రంగారావు కూడా రిమాండ్
- పీటీ వారెంట్‌కు కోర్టు అనుమతి



నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీకి సంబంధించిన కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వంశీ అనుచరుడు మోహన్ రంగారావుకు కూడా నూజివీడు కోర్టు ఇదే విధమైన ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ఏలూరు జిల్లా పరిధిలోని బాపులపాడు మండలంలో నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్న ఆరోపణలపై వల్లభనేని వంశీ, మోహన్ రంగారావులపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి విచారణ చేపట్టిన నూజివీడు న్యాయస్థానం, ఇరువురికీ మే 29వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా, ఈ కేసులో నిందితులుగా

వివరాలు 2లో..

### రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు..

## ప్రతి గింజ కొంటాం



రైతు లు ధాన్యాన్ని బయట అమ్ముకో వద్దని.. ప్రతి గింజ ప్రభుత్వమే కొంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం (మే 16) ధాన్యం కొనుగోళ్లపై సీఎస్, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం మాట్లాడుతూ.. రైతులకు

వివరాలు 2లో..

# మళ్లీ పంజా విసురుతున్న కరోనా.. హాంకాంగ్, సింగపూర్‌లో మళ్లీ విజృంభిస్తున్న కేసులు

ఆసియాలోని పలు దేశాల్లో కరోనా వైరస్ మరోసారి పంజా విసురుతోంది. ముఖ్యంగా అధిక జనసాంద్రత కలిగిన హాంకాంగ్, సింగపూర్ నగరాల్లో కోవిడ్ కేసులు వేగంగా పెరుగుతున్నాయని అక్కడి ఆరోగ్య అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిణామం ఆసియా వ్యాప్తంగా ఆందోళనలకు దారితీస్తోంది.హాంగ్‌కాంగ్‌లో ప్రస్తుతం వైరస్ కేసులు 'చాలా ఎక్కువగా'
ఉన్నాయని నగర ఆరోగ్య పరిరక్షణ కేంద్రంలోని అంటువ్యాధుల విభాగం అధిపతి అల్బర్ట్ స్థానిక మీడియాకు తెలిపారు. ఇటీవల కాలంలో హాంగ్‌కాంగ్‌లో శ్వాసకోశ నమూనాల్లో కోవిడ్ పాజిటివ్‌గా తేలుతున్న వారి శాతం గతేడాది ఇదే సమయంతో పోలిస్తే అత్యధిక స్థాయికి చేరింది. మే 3తో ముగిసిన వారంలో తీవ్రమైన కేసులు, మరణాలు కూడా దాదాపు ఏడాది గరిష్ఠ స్థాయికి చేరి 31గా నమోదయ్యాయని సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత రెండేళ్లలో చూసినంత తీవ్రస్థాయిలో ప్రస్తుత వ్యాప్తి లేనప్పటికీ, మురుగునీటిలో పెరుగుతున్న వైరల్ లోడ్, కోవిడ్ సంబంధిత వైద్య సంప్రదింపులు, ఆసుపత్రులలో చేరికలు వంటివి 70 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరంలో వైరస్ చురుకుగా వ్యాపిస్తోందని సూచిస్తున్నాయి.

**సింగపూర్‌లో 14వేలకు పైగా కేసులు**

ఆసియా ఆర్థిక కేంద్రంగా పేరొందిన సింగపూర్ కూడా కోవిడ్ విషయంలో అప్రమత్తమైంది. నగర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దాదాపు ఏడాది తర్వాత ఈ నెలలో తొలిసారిగా ఇన్ఫెక్షన్ల సంఖ్యపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. మే 3తో ముగిసిన వారంలో అంతకుముందు ఏడు రోజులతో పోలిస్తే కేసుల సంఖ్య 28 శాతం పెరిగి 14,200కు చేరింది. రోజువారీ ఆసుపత్రి చేరికలు కూడా సుమారు 30 శాతం పెరిగాయి. సాధారణంగా కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పుడు మాత్రమే సింగపూర్ ఆరోగ్య శాఖ వివరాలను వెల్లడిస్తుంది. ప్రజల్లో రోగనిరోధక శక్తి తగ్గడం వంటి కారణాల వల్ల కేసులు పెరుగుతున్నప్పటికీ ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న వేరియంట్లు మహమ్మారి సమయంలో ఉన్నంత వేగంగా వ్యాపించేవి లేదా మరింత తీవ్రమైనవి అనడానికి ఆధారాలు లేవని సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.
గత కొన్ని నెలలుగా ఆసియా వ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతుండటంతో ఈ రెండు ప్రధాన నగరాల్లో తాజా ఉద్ధృతి ఆందోళన కలిగిస్తోంది. టీకాలు క్రమం తప్పకుండా తీసుకోవాలని, ముఖ్యంగా అధిక ప్రమాదం ఉన్నవారు బూస్టర్ డోసులు వేసుకోవాలని ఆరోగ్య అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. చలికాలంలో ఎక్కువగా క్రియాశీలంగా ఉండే ఇతర శ్వాసకోశ వ్యాధుల మాదిరిగా కాకుండా, ఉత్తరార్ధగోళంలో వేసవి కాలం ప్రవేశిస్తున్న తరుణంలో కోవిడ్ మళ్లీ విజృంభించడం, అధిక ఉష్ణోగ్రతలలో కూడా వైరస్ పెద్ద సంఖ్యలో ప్రజలను అనారోగ్యానికి గురిచేయగలదని స్పష్టం చేస్తోంది.

**కరోనా బారిన గాయకుడు**

ఇదిలా ఉండగా, హాంగ్‌కాంగ్ గాయకుడు ఈసన్ చాన్ కూడా కోవిడ్ బారిన పడ్డారు. దీంతో ఈ వారం చివర్లో తైవాన్‌లోని కాయోషియంగ్‌లో
జరగాల్సిన తన కచేరీలను రద్దు చేసుకోవాల్సి వచ్చిందని కచేరీ నిర్వాహకులు చైనా సోషల్ మీడియా వేదిక వీబోలో గురువారం తెలిపారు. చైనాలో కూడా గత ఏడాది వేసవిలో నమోదైన గరిష్ఠ స్థాయికి కోవిడ్ కేసులు చేరే అవకాశం ఉందని చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ గణాంకాలు సూచిస్తున్నాయి. మే 4తో ముగిసిన ఐదు వారాల్లో దేశవ్యాప్తంగా ఆసుపత్రులలో రోగ నిర్ధారణ కోసం వచ్చిన రోగులలో కోవిడ్ టెస్ట్ పాజిటివిటీ రేటు రెట్టింపు కంటే ఎక్కువైంది. థాయ్‌లాండ్‌లో ఈ ఏడాది రెండు క్లస్టర్ వ్యాప్తి ఘటనలు నమోదయ్యాయని, ఏప్రిల్‌లో జరిగిన వార్షిక సాంగ్‌క్రాన్ పండుగ తర్వాత కేసులు పెరిగాయని ఆ దేశ వ్యాధి నియంత్రణ విభాగం నివేదించింది.

# సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానమాచరించిన డిప్యూటీ సీఎం భట్టి దంపతులు

- మొదటి పేజి తరువాయి

ఆచరించారు. తర్వాత సరస్వతి మాత నదికి ప్రత్యేక పూజలు చేసి పట్టు చీరతో సారె అప్పజేప్పారు. భట్టి సరస్వతి నది హారతి కార్యక్రమంలో పాల్గొని వీక్షించారు. భట్టి పర్యటన నేపధ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. కాగా, గురువారం (మే 15) నుంచి సరస్వతి పుష్కరాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర సరస్వతి పుష్కర మహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎంకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సరస్వతి నదిలో మంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి పుణ్యస్నానమాచరించారు. తర్వాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించి.. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఈ నెల 15 నుంచి 26 వ తేదీ వరకు 12 రోజులపాటు సరస్వతీనది పుష్కరాలు వైభవంగ జరుగనున్నాయి .

ఈ సమయంలో సరస్వతి నదితీరంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేస్తారు. ఏ నదిలో పుష్కరాలు జరుగుతున్నాయో ఆ నదిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తే పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రస్తుతం సరస్వతి నది పుష్కరాలకు సిద్ధమవుతుంది. తెలంగాణలోని కాళేశ్వరంలో సరస్వతినదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు లక్షలాది మంది భక్తులు సిద్ధమవుతున్నారు. ఈ పుష్కరాలు కాళేశ్వరం ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను పెంచుతుంది. టెంపుల్ టూరిజంపై తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న ఆసక్తిని కూడా ప్రతిబింబించే అవకాశం ఉంది. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

**సరస్వతి నది పుష్కరాలు జరిగే ప్రదేశాలు**

తెలంగాణా రాష్ట్రంలోని కాళేశ్వరంలోని త్రివేణీ సంగమంలోను సరస్వతీ నదీ పుష్కరాలు జరుగుతాయి.
సరస్వతీ నది ఉత్తరాఖండ్ రాష్ట్రం బద్రీనాథ్ దగ్గరలోని "మన" అనే గ్రామంలో పుట్టింది. అయితే ఈ నది అంతర్వాహిని. అందువల్ల సరస్వతి నదీ పుష్కరాలు "మన" లో జరుగుతాయి. తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. నదిలో సమృద్ధిగా నీళ్లు ఉండి, పుష్కరాలు విజయవంతంగా జరిగేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది.

# ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం... ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

దాదాపు తొమ్మిది గంటల పాటు వీరిద్దరినీ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.ఈ కేసులో ధనుంజయ్‌రెడ్డి ఏ31 నిందితుడిగా, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32 నిందితుడిగా ఉన్నారు. కాగా, ఇదే కేసులో వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తు అధికారి విచారణకు ఆటంకం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వీరి ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, రెగ్యులర్ బెయిల్ కోసం నిబంధనలు, మెరిట్స్ ఆధారంగా హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది.వేల కోట్ల రూపాయల మద్యం కుంభకోణంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ కేసులో, నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డితో పాటు భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను కూడా సిట్ ఇటీవల నిందితుల జాబితాలో చేర్చింది. ఈ కేసులో ఏ33 నిందితుడిగాద

ఉన్న గోవిందప్ప బాలాజీని సిట్ అధికారులు మంగళవారమే అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.
గతంలో ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విచారణకు హాజరుకావాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని సిట్ కార్యాలయంలో గత మూడు రోజులుగా వీరి విచారణ కొనసాగింది. తాజాగా సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించడంతో వీరి అరెస్టుకు మార్గం సుగమమైంది.

# హైదరాబాద్‌లో డేటా సిటీ

- మొదటి పేజి తరువాయి

కృష్ణభాస్కర్, ముషారఫ్, రెడ్కో ఎండీ అనిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... "గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. త్వరలో నగరంలో డేటాసిటీ ఏర్పాటు చేయబోతున్నాం. పెరుగుతున్న ఈ అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు ఉత్పత్తిని పెంచుకోవాలి. ఫ్యూచర్ సిటీలో ఎక్కడా విద్యుత్ టవర్లు, స్తంభాలు, తీగలు బహిరంగంగా కనిపించొద్దు. పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు వేయాలి. ఇప్పటికే ఉన్న హైటెన్షన్ లైన్లను సైతం తరలించాలి. జీహెచ్ఎంసీ పరిధిలో సచివాలయం, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా స్మార్ట్ కరెంటు స్తంభాలను ఏర్పాటు చేయాలి. ఓఆర్ఆర్ పొడవునా సౌరవిద్యుత్ ఉత్పత్తికి ప్రణాళిక రూపొందించాలి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఫుట్‌పాత్‌లు, నాలాలపైనా సౌరవిద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలి.

**హరిత ఇంధనం, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రానికి వెల్లువెత్తుతున్న పెట్టుబడుల ఆలంబనగా తెలంగాణలో జరగబోయే పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు విద్యుత్ సరఫరా ప్రణాళికను తయారు చేసుకోవాలి. పరిశ్రమలతోపాటు జీసీసీలు, మెట్రో రైళ్లు, విద్యుత్ వాహనాలకు అదనంగా జరిగే వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలి. డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచుతూ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టులతో వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. అందుకనుగుణంగా మూడేళ్ల విద్యుత్తు
ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. హరిత ఇంధన ఉత్పత్తి, వినియోగం, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి. రిజర్వాయర్లు, చెరువులపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుదుత్పత్తికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. క్లీన్‌అండ్‌గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలుపై దృష్టి సారించాలి. విద్యుదుత్పత్తిలో దిగ్గజ సంస్థలకు అవకాశం ఇవ్వాలి. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్‌షిప్‌లకు కావాల్సిన విద్యుత్‌పై హెచ్ఎండీఏ, విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేయాలి" అని ఆదేశించారు.

# తుర్కియేతో తెంచేసుకుందాం

- మొదటి పేజి తరువాయి

స్పష్టమైన సందేశం పంపాలి: రత్నాభరణాల మండలి
తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలతో అన్ని వ్యాపార లావాదేవీలను రద్దు చేసుకోవాలని అఖిల భారత రత్నాభరణాల దేశీయ మండలి (జీజేసీ) కోరింది. 'దేశ సమగ్రతకు భారత రత్నాభరణాల రంగం మద్దతుగా నిలుస్తుంది. తుర్కియే, అజర్‌బైజాన్‌తో ఉన్న అన్ని లావాదేవీలను ప్రతి ఆభరణ తయారీదారు, ట్రేడరు, టోకువర్తకులు నిలిపివేయాలని పిలుపునిస్తున్నామ'ని జీజేసీ ఛైర్మన్ రాజేశ్ రోక్డే పేర్కొన్నారు. వాణిజ్యాన్ని నిలిపేయడం ద్వారా ఒక స్పష్టమైన సందేశం పంపాలన్నదే తమ లక్ష్యమన్నారు.

**ఆ దేశ కంపెనీలతో సంబంధం వద్దు: వ్యాపారుల సమాఖ్య**

అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (కెయిట్) సైతం ఆ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించింది. తుర్కియే, అజర్‌బైజాన్ వస్తువులపై దేశవ్యాప్త నిషేధం కూడా ఇందులో భాగమేనని తెలిపింది. ఆ రెండు దేశాల నుంచి మన ట్రేడర్లు ఎటువంటి దిగుమతులూ చేసుకోరని స్పష్టం చేసింది. భారత ఎగుమతిదార్లు, దిగుమతిదార్లు, వ్యాపార వర్గాలు సైతం ఆ రెండు దేశాల్లోని కంపెనీలతో ఎటువంటి సంబంధాలూ పెట్టుకోరని తెలిపింది. ఆ మేరకు ఒక మెమొరాండంను వాణిజ్య, పరిశ్రమల శాఖ, విదేశీ వ్యవహారాల శాఖకు సమర్పించనుంది. ఈ రెండు దేశాల్లో చిత్రీకరణ జరిపే భారతీయ సినిమాలనూ వ్యాపార వర్గాలు దూరం పెడతాయని.. అందువల్ల కార్పొరేట్ సంస్థలు అక్కడ ఎటువంటి సినిమాలూ తీయరాదని తెలిపాయి.

**తుర్కిష్ విమానాలు మనకొద్దు**

తుర్కిష్ ఎయిర్‌లైన్స్‌తో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కుదుర్చుకున్న లీజింగ్ ఒప్పందాన్ని నిలిపేయాలని భారత అధికార్లను ఎయిరిండియా కోరుతున్నట్లు సమాచారం. పాకిస్థాన్‌కు తుర్కియే మద్దతుగా నిలిచిన సమయంలో.. విమానయాన భద్రత - వ్యాపార పరంగా ఈ లీజు ప్రభావం చూపగలదని ఎయిరిండియా వివరించినట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. 2023లో కుదిరిన ఈ ఒప్పందం కింద దిల్లీ-ముంబయి-ఇస్తాంబుల్ మార్గంలో తుర్కిష్ ఎయిర్‌లైన్స్ రెండు విమానాలను, కొంత మంది సిబ్బందిని ఇస్తోంది. దీనివల్ల ఆ దేశ పర్యాటకానికి ఊతం లభిస్తోంది. ఈ పరిణామాలపై పౌర విమానయాన శాఖ, ఎయిరిండియా, తుర్కిష్ ఎయిర్‌లైన్స్ స్పందించలేదు. 2024-25 ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య భారత్ నుంచి తుర్కియేకు ఎగుమతులు 5.2 బి.డాలర్లు (రూ.45,000 కోట్లు)గా ఉన్నాయి. మనదేశ మొత్తం ఎగుమతులు 437 బి.డాలర్లలో ఇవి 1.5 శాతానికి సమానం. ఇదేకాలంలో తుర్కియే నుంచి దిగుమతులు 2.84 బి.డాలర్లుగా ఉన్నాయి. మనదేశ మొత్తం దిగుమతులు 720 బి.డాలర్లలో ఇవి 0.5 శాతం. 2024-25 ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య అజర్‌బైజాన్‌కు మన ఎగుమతులు 86.07 మి.డాలర్లు మాత్రమే. మన మొత్తం ఎగుమతుల్లో ఇవి 0.02 శాతానికి సమానం. అజర్‌బైజాన్ నుంచి 0.0002 శాతానికి సమానమైన 1.93 బి.డాలర్ల దిగుమతులు వచ్చాయి. తుర్కియే మార్బుల్స్, యాపిళ్లు, బంగారం, సిమెంట్, రసాయనాలు, సహజ ముత్యాలు, ఉక్కు దిగుమతి చేసుకుంటున్నాం. అజర్‌బైజాన్ నుంచి రసాయనాలు, సుగంధ ద్రవ్యాలు, తోళ్లు దిగుమతి అవుతున్నాయి.

**సెలెబికి భారత్‌లో 10,000 మందికి పైగా సిబ్బంది**

ఇప్పటికే దేశంలోని ముంబయి, దిల్లీ, హైదరాబాద్, కోచి, కన్నూర్, బెంగళూరు, గోవా, అహ్మదాబాద్ విమానాశ్రయాల్లో బహుళ సేవలు అందిస్తున్న తుర్కియే కంపెనీ అనుబంధ సెలెబి ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్‌కు అనుమతులను భద్రతా కారణాలతో మనదేశం రద్దుచేసింది. ఈ కంపెనీకి మనదేశంలో 10,000 మందికి పైగా సిబ్బంది ఉన్నారు. ఇప్పుడు వీరి స్థానంలో ప్రభుత్వరంగ ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్, ఏఐశాట్స్, బర్డ్ వరల్డ్‌వైడ్ ఫ్లైట్ సర్వీసెస్, ఇండో థాయ్ ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వంటి సంస్థల సిబ్బంది కార్యకలాపాలు చూస్తున్నారు. ఇందుకోసం విమానాశ్రయాల పాసులను వారికి మంజూరు చేశారు కూడా.

# రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు.. ప్రతి గింజ కొంటాం

- మొదటి పేజి తరువాయి

ఎలాంటి ఇబ్బంది కలగకుండా రాష్ట్రవ్యాప్తంగా సన్న, దొడ్డు వడ్లు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పేమెంట్ ఆలస్యం లేకుండా వెంటవెంటనే రైతుల అకౌంట్లో పడేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలిగితే సంబంధిత టోల్ ఫ్రీ నెంబర్?కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సీజన్లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. పంటలు ఎండిపోకుండా విద్యుత్, నీటి సరఫరా చేశామని.. మాది రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు.

# వ్యాపారుల అక్రమాలపై పీడీ చట్టం

- మొదటి పేజి తరువాయి

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో సీఎస్ మాట్లాడాలి. నకిలీ కంపెనీలు, కల్తీ విత్తనాల బారిన పడి రైతులు మోసపోకుండా వ్యవసాయ శాఖ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలి. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు.. ఎక్కడ నిల్వలున్నాయి.. ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలపై అధికారులకు సమాచారం ఉంది. ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి" అని సీఎం ఆదేశించారు.

**పథకాల అమలుకు ఆర్థిక వనరులపై సమగ్ర నివేదిక**

రైతు భరోసా, పంటల బీమా తదితర పథకాలకు నిధుల అవసరం, వనరుల సమీకరణకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని సీఎం రేవంత్ ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావును ఆదేశించినట్లు తెలిసింది. పథకాలకు గతంలో వెచ్చించిన నిధులపై అధికారులు సమాచారం ఇచ్చారు. వాటిని కొనసాగించేందుకు ఎన్ని నిధులు కావాలనే దానిపై సమాచారం ఇవ్వాలని సీఎం పేర్కొన్నట్లు తెలిసింది. సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఇళ్ల పట్టాల కేసు

# వల్లభనేని వంశీకి 14 రోజుల రిమాండ్

- మొదటి పేజి తరువాయి

ఉన్న వీరిద్దరిపై ప్రొడక్షన్ ట్రాన్సిట్ (పీటీ) వారెంట్ జారీ చేసేందుకు కూడా కోర్టు అనుమతి మంజూరు చేసినట్లు సమాచారం. తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.
పలు కేసుల్లో వల్లభనేని వంశీకి బెయిల్ వచ్చినప్పటికీ, మరికొన్ని కేసుల్లో రిమాండ్ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, ఆయన ఇప్పట్లో విడుదలయ్యే అవకాశాలు తక్కువే.

# మద్యం స్కాంలో కసిరెడ్డి వాంగ్మూలానికి కోర్టు గ్రీన్ సిగ్నల్... కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక పరిణామాలు వేగంగా చోటుచేసుకుం టున్నాయి. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వారి ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేయడంతో, వారి అరెస్టుకు మార్గం సుగమమైంది. మరోవైపు, ఇదే కేసులో మరో కీలక వ్యక్తిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేసేందుకు ఏసీబీ కోర్టు పచ్చజెండా ఊపింది.మద్యం కుంభకోణం కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఈ దశలో జోక్యం చేసుకుంటే దర్యాప్తునకు ఆటంకం కలిగే అవకాశం ఉందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో, సుప్రీంకోర్టు ఉత్తర్వులు అందిన వెంటనే వీరిద్దరినీ అరెస్టు చేసేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిని సిట్ అధికారులు గత మూడు రోజులుగా విడివిడిగానూ, కలిపి కూడా విచారిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఇద్దరు వ్యక్తులు ముఖ్యమంత్రి కార్యాలయంలో చక్రం తిప్పారనే ఆరోపణలున్న నేపథ్యంలో, వీరి అరెస్టు రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చనీయాంశంగా మారింది.ఇదే కేసులో మరొక కీలక పరిణామంగా, రాజ్ కసిరెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని రాజ్ కసిరెడ్డిని ఆదేశిస్తూ, తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయి. దర్యాప్తులో భాగంగా అనేక మంది పాత్ర వెలుగులోకి వస్తున్నట్లు తెలుస్తోంది.మరోవైపు, ఈ కేసులో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగింది. రాజ్ కసిరెడ్డి నుంచి వాంగ్మూలం తీసుకునేందుకు అనుమతి కోరుతూ ఈడీ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కూడా ఈ నెల 19న విచారణ జరగనుంది.ఇక, మద్యం కుంభకోణం కేసులో ఏ3 నిందితుడిగా ఉన్న గోవిందప్ప బాలాజీ కస్టడీ పిటిషన్‌పైనా ఏసీబీ కోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, ఈ పిటిషన్‌పై విచారణను కూడా ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. మూడు రోజుల క్రితం అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న బాలాజీ నుంచి మరింత కీలక సమాచారం రాబట్టేందుకు అధికారులు కస్టడీ కోరుతున్నారు. దాదాపు వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని అధికారులు కోర్టును అభ్యర్థించినట్లు సమాచారం.
కాగా, ఈ నెల 19న జరగబోయే విచారణలు ఈ కేసు గమనంలో మరింత కీలకం కానున్నాయి.

# అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వసుధ చేయూత.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 16,**అనారోగ్యంతో బాధపడుతున్న భద్రాచలం కు చెందిన ఇరువురు మహిళలకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూతను అందించింది. అలవాల విజయ, ఎస్ మమత లకు వసుధ ఫౌండేషన్ రూ పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇరువురు తమకు ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ను ఆశ్రయించగా సానుకూలంగా స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కు సూచించారు. ఈ క్రమంలో విజయ, మమతలకు దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేదలకు విద్యా వైద్య అవసరాల కోసం వసుధ ఫౌండేషన్ అందిస్తున్న చేయూత ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో సైతం వసుధ సేవలు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

# టాస్క్ ఫోర్స్ ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 16,**గంజాయి అక్రమ రవాణాను నిరోధించినందుకు డిజిపి డాక్టర్ జితేంద్ర ఐపీఎస్ వారు హైదరాబాద్ లకిడికపూల్ లోని వారి కార్యాలయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టాస్క్ ఫోర్స్ ఎస్సై జలకం ప్రవీణ్‌కు ప్రశంసాపత్రంతో పాటు నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలో ఎస్సై ప్రవీణ్‌ను అభినందిస్తూ టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ యాస యుగంధర్, ఐలు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పు శెట్టి సునీల్ కుమార్ సన్మానించారు.

# 3కేజీలు ప్లాస్టిక్ సీజ్ చేసిన శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరావు




**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 16 :** రేసపువానిపాలెం లో ఉన్న స్ట్రీట్ వేండర్స్ షాపులకు ప్లాస్టిక్ వినియోగించే వ్యాపారస్తులకు, 24 వ వార్డ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్ పి వెంకటేశ్వరావు మరియు సెక్రెటరీస్ మోహన్, పద్మజ, షరాన్, సతీష్ మరియు సూపర్వైజర్లు కోట రమణ, మణి, భాస్కరరావు అందరం కలిసి 2వేలు రూపాయలు ప్లాస్టిక్ రుసుము విధించి కట్టించాము, 3కేజీలు ప్లాస్టిక్ సీజ్ చేసి వార్డ్ ఆఫీసుకి తరలించడం జరిగింది.

# వాలంటరీ మెడికల్ ఖర్చులకు వాసుపల్లి చేయూత

- ఇంటికి వెళ్లి పరామర్శించి పది వేలు అందజేశారు
- కూటమి ప్రభుత్వంలో రోడ్డునపడ్డ వాలంటరీల జీవితాలు
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



**సి కె న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) మే 15 :** వైసిపి ప్రభుత్వంలో ఆనందంగా ఉన్న వాలంటరీ వ్యవస్థ రోడ్డున పడేలా కూటమి ప్రభుత్వం యువతను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ధ్వజమెత్తారు. గతంలో వాలంటరీగా పని చేసిన ఇంటి పెద్దదిక్కు అంగటి శ్రీనివాసరావు ను తీవ్ర అనారోగ్య పరిస్థితి తెలుసుకుని 27వ వార్డు వైసిపి నేతలతో కలిసి వాసుపల్లి గణేష్ కుమార్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. తక్షణమే సొంత నిధులు రూ.10 వేలు నగదును అందజేసి భరోసా కల్పించారు. 27వ వార్డు దొండపర్తి నెహ్రూ బజార్ 143 సచివాలయంలో అంగటి శ్రీనివాసరావు, ఆయన భార్య అంగటి పార్వతి దంపతులిద్దరూ వాలంటరీ ఉద్యోగాలు చేస్తూ కుటుంబం పోషించేవారు. కూటమి ప్రభుత్వం తొలగించడంతో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి మరొక చేదు వార్త వారి కుటుంబాన్ని దిక్కుతోచని స్థితిలో నెట్టి వేసింది. కాళ్ల నొప్పులతో ఆసుపత్రికి వెళ్ళగా హిమోక్లిలీయా అంతు చెక్కిన వ్యాధి సోకిగా ఫ్యాక్టరీ ఇంజక్షన్ జీవితాంతం ఉపయోగించాలని డాక్టర్లు సూచించారు. ఇద్దరు చిన్నారులతో కుటుంబ పోషణ ఇబ్బంది పడుతూ దిక్కుతోచని పరిస్థితుల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. ఆర్థిక సాయంతో పాటు మెడికల్ కు అవసరమైన సపోర్ట్ అందిస్తానని వారికి ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వాలంటరీలకు అధికారంలోకి వస్తే జీతాలు డబల్ చేస్తామంటూ దొంగ హామీలు ఇచ్చిన చంద్రబాబు పవన్ కళ్యాణ్ లు యువతను తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు. అవినీతి రహిత సమాజం కోసం జగన్మోహన్ రెడ్డి వాలంటరీ వ్యవస్థను తీసుకువచ్చారని, యువతకు ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత వైఎస్ఆర్సిపి ప్రభుత్వానిదేనన్నారు. సంక్షేమ ఫలాలు రెట్టింపు చేస్తామని ప్రజలను మోసం చేసి అందలం ఎక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తీరు మార్చుకొని వాలంటరీలకు తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోజిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భారత్,27వ వార్డ్ మాజీ డైరెక్టర్ వైస్సార్సీపీ విశాఖ జిల్లా సెక్టరీ పద్మనాభం అమ్మాజీ, 27వ వార్డ్ ప్రెసిడెంట్ నీలపు సర్వేశ్వర రెడ్డి, సౌత్ ఎస్ సి సెల్ అధ్యక్షులు ఆకుల శ్యామ్,మధు రెడ్డి,పిల్లి అజయ్ రెడ్డి,వి టీ కృష్ణ కుమార్,అంగతి కుమార్ ,సాగర్, మౌలేష్, గంగాధర్,రామరాజు,రాము తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ... తహశీల్దార్ పున్నంచందర్.

- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
- బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్.



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం/బోనకల్, మే-16:**భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ ఏ. పున్నం చందర్ అన్నారు. మంగళవారం బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామంలో తహసీల్దార్ రెవెన్యూ సదస్సు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు.

హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు

హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా గోవిందాపురం(ఏ) గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 52 దరఖాస్తులను అధికారులు స్వీకరించి, రశీదులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శర్మ, బోనకల్ మండల ఆర్ఐ మైథిలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకం.




## ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

## టి డబ్ల్యూ జె ఎఫ్ 3వ జిల్లా మహాసభల పోస్టర్లను ఆవిష్కరణ.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 16,**

భద్రాచలం : సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకమని భద్రాచలం ఏఎస్పి విక్రమ్ కుమార్ సింగ్ అన్నారు. శు క్రవారం భద్రాచలం ఏఎస్పి కార్యాలయం లో ఆయన ప్రత్యేక ఛాంబర్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తృతీయ మహాసభల పోస్టర్లను యూనియన్ నాయకుల తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘవిద్రోహక చర్యలను పోలీసుల దృష్టికి తీసుకు వచ్చి శాంతియుత వాతావరణాన్ని




కల్పించడంలో విలేకరుల పాత్ర కీలకంగా ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు, స్థానికంగా నెలకొన్న సమస్యలను జర్నలిస్టులు పోలీసుల, ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమం లో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ కర్ర అనిల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పూదోట సూరిబాబు, గుండెబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ రెడ్డి, యూనియన్ నాయకులు సుధీర్, సాయి కౌశిక్, నవీన్, అనిల్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఈపి ఆపరేటర్ల పదోన్నతుల లేఖలు అందజేయాలి.

- ఇతర గ్రేడ్ ల ఖాళీలు భర్తీ కి చర్యలు చేపట్టాలి.
- ఏరియా ఈ పి ఆపరేటర్ల ఆధ్వర్యంలో ఎస్ ఓ టు జి ఎం డి శ్యామ్ సుందర్ కి వినతి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 16,**ఈపి ఆపరేటర్ల పదోన్నతుల లేఖలు అందజేయాలనీ ఇతర గ్రేడ్ ల ఖాళీలు భర్తీ చేయాలనీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నాడు మణుగూరు ఏరియా ఈ పి ఆపరేటర్ల ఆధ్వర్యంలో ఎస్ ఓ టు జి ఎం డి శ్యామ్ సుందర్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈపీఆపరేటర్స్ మణుగూరు ఏరియా సమన్వయకర్త ఎస్ డి నా సర్ పాషా మాట్లాడుతూ కొత్తగూడెం రీజియన్ స్థాయిలో మణుగూరు కొత్తగూడెం సత్తుపల్లి ఇల్లందు ఓసి గనులలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్స్ స్పెషల్ గ్రేడ్ ,ఏ గ్రేడ్, బి గ్రేడ్ ఖాళీల భర్తీ కోసం మార్చి రెండు నుంచి ఐదు వరకు నాలుగు రోజులపాటు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మణుగూరులో అర్హత పరీక్షల నిర్వహించి పరీక్ష ఫలితాలు వెల్లడించారనీ ఇందుకు ఏరియా యాజమాన్యానికి ఆపరేటర్ తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా సకాలంలో పదోన్నతుల లేఖలు అందజేస్తే ఆపరేటర్లు చాలా సంతోషిస్తారనీ అలాగే రెండు సంవత్సరాలు "డి" గ్రేడ్ లో పనిచేసిన ఆపరేటర్లకు "సి"గ్రేడ్ ఖాళీల భర్తీకి తగు చర్యలు చేపట్టవలసిందిగా మణుగూరు ఏరియా ఈ పీ ఆపరేటర్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు, వీటితోపాటు ఇటీవల గ్రేడ్ టెస్ట్ పూర్తి చేసుకున్న నూట నలభై ఐదు బ్యాచ్ ఆపరేటర్లకు డి గ్రేడ్ పదోన్నతుల లేఖలు అందజేయాలని నూట నలభై నాలుగు బ్యాచ్ ఆపరేటర్లలో డిస్ క్వాలిఫైడ్ అయిన ఐదుగురికి న్యాయం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు దరిశా రమేష్, సిహెచ్ అనిల్, ఎన్ సంతోష్, జి శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు.....





- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి.
- హమాలీలు, రవాణా వాహనాల కొరత లేకుండా పకడ్బందీ చర్యలు
- ధాన్యం కొనుగోలు, రేషన్ కార్డుల జారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, మే -16:** యాసంగి సీజన్ లో తెలంగాణ రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమీషనర్ డి.ఎస్. చౌహాన్ లతో కలిసి ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి, కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ మద్దతు ధరపై కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మన దగ్గర రికార్డ్ స్థాయిలో 57 లక్షల ఎకరాలలో వరి పంట సాగు జరిగిందని, ప్రభుత్వం దాదాపు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసిన 48 గంటల్లో రైతులకు ఖాతాలో డబ్బు జమ అవుతుందని అన్నారు. భారీ స్థాయిలో కొనుగోలు జరుగుతున్నప్పటికీ మీడియాలో సరిగ్గా కవర్ కావడం లేదని అన్నారు. పత్రికలలో వచ్చే నెగటీవ్ వార్తలపై స్పందించాలని, సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించాలని అన్నారు.

రాబోయే 15 రోజులలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీలు, రవాణా వాహనాల కొరత రాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్నీ బ్యాగ్ లు, టార్ఫాలిన్ కవర్లు అందుబాటు లో పెట్టాలని అన్నారు. రైస్ మిల్లర్లతో కలెక్టర్, ఉన్నతాధికారులు చర్చించాలని, జిల్లాలలో అవసరమైతే ఇంటర్మీడియట్ గోదాములకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని అన్నారు. అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు.

2025, జనవరి 26 తర్వాత మన రాష్ట్రంలో నూతనంగా 1,57,467 రేషన్ కార్డులను పంపిణీ చేశామని, మీసేవ కేంద్రాలు, ప్రజాపాలన కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలని మంత్రి తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ధాన్యం పెండింగ్ లో ఉన్నదని, కొనుగోలు సజావుగా పూర్తి చేయాలని, మిల్లర్ల వద్ద తరుగు తీయకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రవాణా కాంట్రాక్టర్ లతో చర్చించి నిర్దేశించిన మేర వాహనాలు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రైస్ మిల్లుల వద్ద తరుగు లేకుండా చూడాలని అన్నారు. గన్ని బ్యాగులు సమస్య రాకుండా చూసుకోవాలని, రవాణా సమస్యలు ఏవైనా ఉంటే సంబంధిత రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాలని మంత్రి తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కలెక్టర్లు ప్రణాళిక బద్ధంగా యాసంగి పంట కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రెగ్యులర్ గా కలెక్టర్లు తనిఖీ చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే చిన్న, చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

ప్రతి రోజు జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ పురోగతిపై మీడియాకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కరించి ఆ సమాచారం కూడా రైతులకు మీడియా ద్వారా తెలియ జేయాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న పౌర సరఫరాల శాఖ కమీషనర్ డిఎస్ చౌహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 7 లక్షల 70 వేల 477 మంది రైతుల నుంచి 49 .53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 8 వేల 42 కోట్లు మద్దతు ధర క్రింద చెల్లించామని అన్నారు.

గతం కంటే అధికంగా ఈ యాసంగి సీజన్ లో మనం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మే 15 నాటికి 2022-23 రబీ సీజన్ లో 25.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, 2023-24 రబీ సీజన్ లో 32.93 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, 2024-25 రబీలో 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. ప్రతి రోజు అదనపు కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మే నెలాఖరు నాటికి పకడ్బందిగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని అన్నారు.

ధాన్యం రవాణాకు వాహనాల ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, కలెక్టర్, ఆర్.టి.ఓ , పోలీస్ అధికారులు సమన్వయంతో ఖాళీగా ఉన్న లారీలను పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలుకు కేటాయించాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం బస్తాల అన్ లోడింగ్ ఆలస్యం కాకుండా చూడాలని, హమాలీల కొరత ఉండకుండా జాగ్రత్త పడాలని అన్నారు.

ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని బ్యాగులు ఉండాలని రైతులకు నేరుగా ఇవ్వవద్దని, మనం కొనుగోలు చేసిన ధాన్యంనింపేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు.

గత ఆరు నెలల కాలంలో రేషన్ తీసుకోక పోవడం, ఇతర రాష్ట్రాలకు చెందిన డూప్లికేట్ బెనిఫిషరీ, చనిపోయిన వారి పేర్లు ఉండటం వంటి వివిధ కారణాల వల్ల భారత ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచారం ప్రకారం 96 వేల 240 రేషన్ కార్డుల పరిధిలోని లక్షా 62 వేల 777 మంది లబ్ధిదారులు అనుమానాస్పదంగా ఉన్నారని, జిల్లాల వారీగా సంబంధిత జాబితా అందించామని, వీటిపై విచారణ చేసి వివరాలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అతిగా మద్యం త్రాగి వాహనాలు నడిపిన కేసులలో 9 మందికి జరిమానా.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),మే 16,**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కోర్టులో 09 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు గురువారం తీర్పుచెప్పారు. కొత్తగూడెం వన్ టౌన్ ఎస్.ఐ జి. విజయ కథనం ప్రకారం వాహనాలు నడుపుతుండగా ఒక్కరిని (1) ఆపి బ్రేత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా అతను మద్యం తాగినట్టు రుజువుగా కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ ముందు అతను నేరం ఒప్పుకొనగా జరిమానా విధించారు. లక్ష్మీదేవిపల్లి ఎస్.హెచ్. ఓ.- జి. రమణారెడ్డి కథనం ప్రకారం ఇద్దరు (2) మద్యం త్రాగి వాహనంలో నడుచుండగా బ్రీతింగ్ అనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్య%శీ% త్రాగినట్లు రుజువు కాగా కోర్టులో ప్రవేశపెట్టగా అట్టి నేరం ఒప్పుకొనగా మేజిస్ట్రేట్ %ఖ%జరిమానా విధించగా, అట్టి జరిమానా చెల్లించారు. పాల్వంచ టౌన్ ఎస్ హెచ్ ఓ. ఐ. జీవనరాజ్ పర్యవేక్షణలో వాహన తనిఖీ చేయుచుండగా ఆరుగురు (6) వ్యక్తులు మద్యం త్రాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. వారికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం తాగినట్లుగా రుజువు కాగా కోర్టులో ప్రవేశ పెట్టగా మెజిస్ట్రేట్ విచారించగా నేరం ఒప్పుకున్నారు.వెంటనే జరిమానాలు విధించగా అట్టి జర్మానాలు చెల్లించారు.

# కలెక్టర్ గారు అన్నారుగూడెం ఎస్సీ కాలనీపై దృష్టి సారించరు

- మోకాల్లోతు వర్షపు నీరు..
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు..





**తల్లాడ/మే 16 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:** కలెక్టర్ గారు తమ కాలనీపై దృష్టి సారించాలని తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు మొరపెట్టుకుంటున్నారు. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సి హరిజనవాడ కాలనీకి వెళ్లి రోడ్డులో వర్షపు నీరు మోకాల్లోతు నిల్వ ఉండి చిన్నపాటి చెరువును తలపిస్తోంది. సిసిరోడ్డు ఉన్నప్పటికీ ఆ ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపు నీరు డ్రైనేజీ లేకపోవడంతో ఎటువైపు వెళ్లే పరిస్థితి లేకుండా పోతుంది. దీంతో స్థానికులు, కాలనీవాసులు ఆ రోడ్డులో నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా దోమలు స్వైర విహారం చేస్తూ రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినప్పటికీ ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. తూతూమంత్రంగా పనులు చేపడుతున్నారు. రానున్నది వర్షాకాలం నేపథ్యంలో కలెక్టర్ గారు దీనిపై దృష్టి సారించి ఆ ప్రాంతంలో సిసి రోడ్డు వేసి తమ బాధలు తీర్చాలని కాలనీవాసులు, స్థానికులు కోరుతున్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం డబ్బు కళాకారులకు 30 డబ్బులు అందజేసినారు.

- మరియు యూత్ సభ్యులకు డిజె సౌండ్ బాక్సులు అందజేసినారు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 16.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో పారిశ్రామికవేత్త పులిపలుపులా, రాములు గౌడ్ అరుణ కుటుంబ సభ్యుల సమక్షంలో వారి సొంత నిధులతో వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు పులిపాలుపుల సోమయ్య యాదమ్మ జాపకార్థం గ్రామములోని డప్పు కళాకారులకు 32 డప్పులు అందజేసినారు.

మరియు బజరంగ యూత్ సభ్యులకు డిజె సౌండ్ బాక్సులు అందజేసినారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి సత్తిరెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినారు.

ఇందులో పాల్గొన్నవారు గ్రామ పెద్దలు యూత్ సభ్యులు పులిపలుపుల రాములు గౌడ్ కుమారులు సుధీర్,సాయి, కూతురు శిరీష, అల్లుండ్లు,మరియు వారి కుటుంబ సభ్యులు బంధువులు అక్క చెల్లెలు బావలు, మనువలు మనవరాలు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రావుల పద్మమ్మ గారి జ్ఞాపకార్థం వెండి వస్తువులు వితరణ





- అమ్మవారికి మొక్కులు చెల్లించిన రావుల...
- 50 తులాల వెండి వస్తువులు వితరణ

**పెబ్బేరు మాండల్:- మే /16 (సి కే న్యూస్)** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారిని దర్శించుకున్న మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డిగారు వారి అమ్మ కీ,,శే.రావులపద్మమ్మ జ్ఞాపకార్థంగా ఆలయానికి శరగోప్యము. స్థాలీ. ఉద్ధరిని. అరివేని పాత్ర. గంట మొత్తం "50 తులాల వెండి" వస్తువులను మొక్కుబడిగా అమ్మవారికి చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గోవర్ధనా చారి రావుల కుటుంబం పేరు పై అష్టోత్తరలతో ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అమ్మవారి ప్రతిష్ఠ కోసం కష్టపడిన కమిటీ సభ్యులను రావుల చంద్రశేఖర్ రెడ్డి అభినందించి సత్కరించారు. అనంతరం కమిటీ సభ్యులు రావుల సర్ ని సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల టౌన్ అధ్యక్షులు వనం రాములు దిలీప్ రెడ్డి,ఆలయ ప్రధాన కార్యదర్శి వడ్డే.ఈశ్వర్ (గురుస్వామి),మండల నాయకులు ఆలయ కమిటీ సభ్యులు,రావుల అభిమానులుపాల్గొన్నారు.

# డి ఐ సి ఎస్ సి ప్రాజెక్ట్ - ఖమ్మం జిల్లా పాయిలట్‌గా ఎంపిక




**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం జిల్లా:**
దేశవ్యాప్తంగా 10 జిల్లాల్లో ప్రారంభమైన డి ఐ సి ఎస్ సి ప్రాజెక్ట్‌లో ఖమ్మం జిల్లాను ముఖ్యంగా (పాయిలట్‌గా) ఎంపిక చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా 137 మంది ఎస్ హెచ్ జి (స్వయం సహాయక సంఘాల) మహిళలు ఎంపికయ్యారు. ఎస్ ఈ ఆర్ పి మరియు సీఎస్ సి కలిసి, ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు మోడల్ సీఎస్ సి కేంద్రాలు స్థాపించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ కేంద్రాలు రాజీవ్ యువ వికాసం మరియు డి ఐ సి ఎస్ సి ద్వారా మంజూరవుతాయి.

ఈ కార్యక్రమంలో 70 మంది మహిళలు ఆర్ ఎస్ ఈ టి ఐ సంస్థలో వ్యాపార శిక్షణ పొందారు. పిడి డి ఆర్ డి ఓ శ్రీ సన్యాసయ్య ప్రాజెక్ట్ నుంచి వచ్చిన సభ్యులు మహిళలతో మాట్లాడి,వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మహిళలు ఐ డి ఓ సి కార్యాలయాన్ని సందర్శించి, డి ఆర్ డి ఓ గారికి కృతజ్ఞతలు తెలిపారు మరియు శిక్షణలో పాల్గొన్న మహిళలకు అభినందనలు చెప్పారు. ప్రభుత్వం తీసుకుంటున్న మంచి కార్యక్రమాలకు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డి ఐ సి ఎస్ సి రాష్ట్ర ఇంచార్జి శ్రీ హరికృష్ణ కుమార్, సి ఎస్ సి జిల్లా కోఆర్డినేటర్ ఫయాజ్, జిల్లా మేనేజర్ సురేష్, ఆర్ ఎస్ ఈ టీ ఐ సిబ్బంది, మరియు ఎస్ హెచ్ జి మహిళలు పాల్గొన్నారు.

# పులిపలుపుల రాములు గౌడ్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం డబ్బు కళాకారులకు 30 డబ్బులు అందజేసినారు.

మరియు యూత్ సభ్యులకు డిజె సౌండ్ బాక్సులు అందజేసినారు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మే 16.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో పారిశ్రామికవేత్త పులిపలుపులా, రాములు గౌడ్ అరుణ కుటుంబ సభ్యుల సమక్షంలో వారి సొంత నిధులతో వారి తల్లిదండ్రులు కీర్తిశేషులు పులిపాలుపుల సోమయ్య యాదమ్మ జాపకార్థం గ్రామములోని డప్పు కళాకారులకు 32 డప్పులు అందజేసినారు.

మరియు బజరంగ యూత్ సభ్యులకు డిజె సౌండ్ బాక్సులు అందజేసినారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి సత్తిరెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినారు.

ఇందులో పాల్గొన్నవారు గ్రామ పెద్దలు యూత్ సభ్యులు పులిపలుపుల రాములు గౌడ్ కుమారులు సుధీర్,సాయి, కూతురు శిరీష, అల్లుండ్లు,మరియు వారి కుటుంబ సభ్యులు బంధువులు అక్క చెల్లెలు బావలు, మనువలు మనవరాలు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి.



సి కే న్యూస్ ఎమ్మిగనూరు టౌన్, మే 16,గోనెగండ్ల మండల పరిధిలోని దేవర ఎర్రబాడు గ్రామంలో కీ.శే.ఆర్.శివారెడ్డి మనవడు, కీ.శే.ఆర్.వీరా రెడ్డి గార్ల కనిష్ట పుత్రుడు రాజశేఖర్ రెడ్డి వెడ్స్ సునీత ల వివాహ వేడుకకు ముఖ్య అతిథులు గా ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కాశీ రెడ్డి,మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్సూర్,దొర బాబు,రంగన్న నాయుడు,ఎర్రబాడు నాయకులు,జాన హరికృష్ణ,తదితరులు పాల్గొన్నారు.


## 1.22కోట్ల రూపాయలతో నూతన కస్తూరిబా గాంధీ జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన చేసిన.....

- మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ ఎన్. రాఘువేంద్ర రెడ్డి .
- బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తున్న కూటమి ప్రభుత్వం.
- ఎన్నో సంవత్సరాలుగా అవస్థలు పడుతున్న విద్యార్థినులు.....
- ఇబ్బందులు త్వరలో తొలగనున్నాయి..బిజెపి ఇంచార్జ్ ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి.



సి కే న్యూస్ ఎమ్మిగనూరు, మే 16,మంత్రాలయం మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో 1.22 కోట్ల నిధులతో మంజూరైన కస్తూరిబా గాంధీ నూతన జూనియర్ కళాశాల భవనం కు ముఖ్య అతిథులు గా మంత్రాలయం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎన్.రాఘువేంద్ర రెడ్డి, బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి హాజరై భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎన్.రాఘువేంద్ర రెడ్డి మాట్లాడుతూ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేయాలని,సంబంధిత కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు త్వరలోనే తొలగనున్నాయని బాలికల విద్యకు కూటమి ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎం ఈ ఓ మొయినుద్దీన్, ప్రిన్సిపాల్ శాంతి ,ఏ.ఈ రంగరాజు , మండల నాయకులు మాజీ జెడ్పిటిసి ఆర్ లక్ష్మయ్య , గోపాల్ రెడ్డి ,చిలకలడోన మాజీ సర్పంచ్ లు హనుమంతు,నర్సన్న పవన్,గోపాల్, వీరేష్, మాలపల్లి లక్ష్మన్న, మండల, చిలకళడోనా గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారేపల్లి రామారావును పరామర్శించిన చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్..



జంగారెడ్డిగూడెం కొయ్యలగూడెం సి కే న్యూస్ జంగారెడ్డిగూడెం కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ పారేపల్లి రామారావు ను చింతలపూడి శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ , శుక్రవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు పెనుమర్తి రామకుమార్, పోల్నాటి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజ మార్గదర్శకుడు మారోజు వీరన్న

భూక్య ఉపేంద్ర బాయి

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం మే 16 : తన నూతన ఆలోచనల మేరకు భారతదేశం లో సమ సమాజం కోసం మార్గదర్శకత్వం వహించిన అమరుడు మారోజు వీరన్న అని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్ర బాయి కొనియాడారు. శుక్రవారం నల్గొండ జిల్లా తుంగతుర్తి మండలం కరివిరాల కొత్తగూడెం లో మారోజు వీరన్న 26వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మారోజు వీరన్న విగ్రహానికి పూలమాలలు వేసి , నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మారోజు వీరన్న కారణంగానే విప్లవోద్యమాలలో నూతన వరవడి, లాల్ నీల్ స్నేహ సంబంధాలలో మార్పులు వచ్చాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మారోజు వీరన్న సతీమణి చైతన్య , కుమార్తె దిశా , సృజన ,సామాజిక కార్యకర్త లలిత వీర చారి , లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ , వీర నారి మణుల ఆశయ సాధన సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు కే. విజయ ,



జిల్లా అధికార ప్రతినిధి త్రివేణి , గౌరవ అధ్యక్షురాలు లక్ష్మి , కార్యదర్శి ప్రమీల , జాయింట్ సెక్రటరీ సరోజిని , సలహాదారులు వీరన్న నాయక్ , రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నందు పలు కార్యక్రమాలకు మరియు పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ..





సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం
ఈరోజు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం నందు పలు కార్యక్రమాలకు హాజరయ్యారు.ఖమ్మం రూరల్ వెంకటగిరి వాస్తవ్యులు మొర్రిమేకల రామసంగం కుమారుడు మోహన్ కృష్ణ వెడ్స్ గౌతమి వివాహానికి హాజరై వదువరులను ఆశీర్వదించారు. 8వ డివిజన్ గోపాలపురం బిఆర్ఎస్ నాయకులు లాల్ సాహెబ్ మరియు కొర్ర లోకేష్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 27వ డివిజన్ శ్రీనివాస్ నగర్ చింతల ప్రసాద్ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాస్ నగర్ చిత్తలూరి నర్సయ్య ఇటీవల శస్త్ర చికిత్స చేయిచుకొనగా వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 29వ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు ఎర్రా అప్పారావు భార్య కృష్ణవేణి ఇటీవల శస్త్ర చికిత్స చేయిచుకొనగా వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ జె సి కృష్ణ,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,కార్పొరేటర్ కూరాకుల వలరాజు,మోతారపు శ్రావణి సుధాకర్,పసుమర్తి రామ్మోహన్,బిక్కసాని జస్వంత్,దనాల శ్రీకాంత్,డోన్వాన్ రవి,తోట వీరభద్రం,పాలడుగు పాపారావు,పత్తిపాక రమేష్,దడాల రఘు,దండగల రాంబాబు,సిరిపురపు సుదర్శన్,గొల్లపుడి రాంప్రసాద్, మిట్టపల్లి రవి,ఎస్ టి సెల్ అధ్యక్షుడు సురేష్,ఖయుమ్,పిన్ని కోటేశ్వరరావు,అశోక్,వీరేందర్, మోహన్,తిరుపతి రావు,మల్లేశం, పణి,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై-9 న జరిగే దేశవ్యాపిత సమ్మెకు మద్దతు

**- ప్రకటించిన ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి.**

**- ఈనెల 20 న జరగాల్సిన సమ్మె అనివార్యంగా జూలై-9 న చేపట్టాలని జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నది.**

( మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సి కే న్యూస్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు 2025 జులై 9 న చేపట్టిన దేశవ్యాపిత సమ్మెకు భారత కార్మిక సంఘాల సమాఖ్యా (ఐ.ఎఫ్.టి.యు- (ఇఫ్టూ)) తన సంపూర్ణ మద్దతును, సంఘీభావాన్ని ప్రకటిస్తున్నదని ఆసంస్థ జాతీయ కన్వీనర్ షేక్ షావలి తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే సమ్మె విజయవంతం కోసం జాతీయ కార్మిక సంఘాలతోపాటు, ఆయా రాష్ట్రాల ప్రాంతీయ సంఘటిత, అసంఘటిత, బహుజన ఉద్యోగ,కార్మిక సంఘాలు తీవ్రంగా కృషి చేశాయని అన్నారు. ఈనెల 20 న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగస్తులు, ఇతర శ్రామిక ప్రజలు, బుద్ధిజీవులు ఎక్కడికక్కడ స్వచ్ఛందంగానే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని వివిధ పోరాటాల రూపంలో మే-5, 2025 నుండి 15 వరకు విస్తృతంగా ప్రచార కార్యమాలు చేపట్టిన విషయం అందరికి తెలిసిన విషయమేనని అన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు మరియు స్వతంత్ర రంగాల సమాఖ్యాలు, సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె అనివార్యంగా ఈ సమ్మెను సమ్మె ను జూలై-9 కి వాయిదా వేయడాన్ని తమ సంస్థ స్వాగతిస్తుందని వెల్లడించారు. తిరిగి కార్మిక వర్గం మరింత సంఘటితంగా తమ సమస్యల పరిష్కారం కొరకు జూలై-9 న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఈసందర్భంగా గుర్తుచేశారు. గత 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం అని చెప్పుకొంటున్న దళారీ దోపిడి పాలవర్గాలకు భారత రాజ్యాంగం ఒక జపమాలగా మారిందని మండిపడ్డారు. చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు రాజ్యాంగ బద్ధంగా ప్రజల అవసరాలు, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చట్టాలు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. 1991 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో అమలుచేసిన నూతన ఆర్థిక, పారిశ్రామిక, ప్రపంచీకరణ, ప్రవేటీకరణ విధానాలు దేశాన్ని, దేశ ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశారని తెలియజేశారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపి ప్రభుత్వం అవేవిధానాలను దూకుడుగా అమలు చేస్తూనే కాషాయికరణతో దేశ ప్రజల మధ్య విచ్చిన్న రాజకీయాలకు పాల్పడిందని అన్నారు. తద్వారా దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసి, ఆర్థిక, రాజకీయ సంక్షోభానికి కారణం అయ్యిందని, నేడు దేశ ప్రజలు అప్పులు, ఆత్మహత్యలు, అర్థాకలి, పస్తులతో తల్లడిల్లుతున్నారని అన్నారు. సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం, పౌర ప్రజాస్వామిక హక్కులతో పాటు పోరాడి సాదించుకున్న అనేక కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధి చట్టాలను కాలరాచారని ఆరోపించారు. నిరుద్యోగం, దారిద్ర్యం, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడిపోతున్నారని గుర్తుచేశారు. వ్యవసాయ, కార్మక వ్యతిరేక చట్టాల వలన నేడు అన్నిరంగాలు ఎన్నడులేని విధంగా తీవ్ర సంక్షోభానికి గురైయ్యాయని, వీటి నుండి ప్రజల దృష్టిని మళ్ళించెందుకు మెజారిటీ హిందుత్వవాద మతతత్వ రాజకీయ విధానాలతో అభివృద్ధి అంటే రామనామ జపమే అనే ధోరణిని పెంచి, ఇతర మైనారిటీలపై విద్వేషపూరితమైన ఘర్షణలు,దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలకు ఉసిగొల్పడమేగాక పహల్గాం దాడికి ప్రతికారంగా పాకిస్థాన్ పై యుద్ధాన్ని ప్రకటించడం సరైన చర్య కాదని, శాంతి పరమైన దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఎందరో మేదావులు,



బుద్ధిజీవులు సూచిస్తున్నప్పటికి, వాటిని పట్టించుకోకుండా రెండు దేశాల ప్రజల మధ్య ఉద్రిక్తలకు కారణం అయ్యి, అమెరికా చెప్పిన వెంటనే కాల్పుల విరమణ ప్రకటించడం లాంటి చర్యలు భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలకే మాయని మచ్చగా అభివర్ణించారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం అమెరికాతోపాటు ఇతర సామ్రాజ్యవాద ప్రయోజనాల దోపిడీకి అనుకూలంగా దేశాన్ని తాకట్టుపెట్టే అన్నిరకాల అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక చట్టాలను రద్దుచేసి, ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేయాలని, అడవిని, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న ఆదివాసి ప్రజల జీవన మనుగడను దృష్టిలో పెట్టుకొని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపి, జాతీయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న ప్రజాస్వామిక, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు.

# ఇప్పటి నుంచే పక్కా ప్లాన్..

**విజయవాడ, మే 16, :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అవగతమయినట్లుంది. కిందిస్థాయిలో క్యాడర్ కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, జనంలోకి వెళ్లడానికి జంకుతున్నారన్న అభిప్రాయానికి వచ్చి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నట్లు కనపడుతుంది. ఏడాది పాలన పూర్తయిన నాటి నుంచి ఇక జోరుగా హామీల అమలుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు నిన్న జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో తన మనసులో మాట చెప్పకనే చెప్పారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం వెళ్లినా ఈసారి కూడా పెద్ద సంఖ్యలో స్థానాలను కూటమి సాధించాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.ఈ ఏడాది జూన్ పన్నెండో తేదీ నాటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టి ఏడాది పూర్తవుతుంది. ఆరోజున లక్షమందికిపైగా వితంతు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి తేదీలతో త్వరలో క్యాలెండర్ ను విడుదల చేయనున్నారు. ఏడాది పొడవునా ఏ ఏ హామీలు ఏ తేదీన అమలు చేయనున్నామో స్పష్టంగా ప్రజల ముందు ఉంచి వారికి ఖచ్చితమైన సమాచారం అందచేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. ఆరు నూరైనా ఆరోజు ఆ హామీని అమలు చేసేలా అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను కూడా రెడీ చేసుకునేందుకు అధికారులకు కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించారు.మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అయితే ఏ నెల నుంచి అమలు చేస్తారరన్నదానిపై ఇంకా స్పష్టత లేకున్నా త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని జిల్లా స్థాయిలో



ప్రవేశపెట్టాలని రెడీ అయిపోయినట్లే కనిపిస్తుంది. దీపం పథకం ఇచ్చే మూడు సిలిండర్లకు సంబంధించి ముందుగానే నగదును లబ్దిదారుల ఖాతాలోనే విడుదల చేయాలని నిర్ణయించారు. సిలిండర్ బుక్ చేసుకున్నారా? లేదా? అన్నది సంబంధం లేకుండా ముందుగానే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. చాలా మందికి డబ్బులు పడటం లేదన్న ఫిర్యాదులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల మహిళల ఓటు బ్యాంకు చెక్కు చెదరకుండా ఉండేలా ఇటు ఉచిత బస్సు పథకం, అటు దీపం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు.మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంతో పాటు ఓటు బ్యాంకు కూడా పటిష్టపర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పాక్ - భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లే అవకాశముందని కూడా చంద్రబాబు అనుమానిస్తున్నారు. జమిలి ఎన్నికలు 2027 లేదా 2028 లో వచ్చినా ప్రజల్లో అసంతృప్తి లేకుండా అన్ని రకాలుగా గ్రౌండ్ ను చంద్రబాబు ప్రిపేర్ చేస్తున్నారు. ఈ సారి కూటమితోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటునట్లే కనపడుతుంది. ఇలా చంద్రబాబు జగన్ పాదయాత్ర చేసినా తన పథకాలతో జనాన్ని తన వైపునకు తిప్పుకునేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు నిర్ణయించి ఈ మేరకు ముందుకు వెళుతున్నారు.

# వైఎస్ రెడ్డి ఎవరో తెలుసా

**విజయవాడ, మే 16, :**
ముంబైలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ గా పని చేస్తున్న వైఎస్ రెడ్డి అనే వ్యక్తిని ఈడీ అరెస్టు చేసింది. ముంబై, హైదరాబాద్ తో పాటు 12 చోట్ల సోదాలు నిర్వహించిన ఈ డి నగదు, నగలు స్వాధీనం చేసుకుంది. మొత్తం 9 కోట్లు ఐదు వందల నోట్లు దొరికాయి. 8 కోట్ల రూపాయల విలువచేసే బంగారు ఆభరణాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇతర ఆభరణాలతో కలిపి మొత్తం 23 కోట్ల రూపాయల విలువచేసే నగలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ముంబైలో 41 భవనాలకు అక్రమ అనుమతులు ఇచ్చారని ఆరోపణలపై ఈడి కేసు నమోదు చేసింది. బిల్డర్స్ తో కుమ్మక్కై అనధికారికంగా అనుమతులు ఇచ్చినట్లు గుర్తించారు. అనధికార భవన అనుమతుల ద్వారా మనీ లాండరింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు జరిగినట్లు ఈడీ తేల్చిది. ఈ కేసు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (%ూమీూా%), 2002 కింద నమోదు చేశారు. ఈడీ హైదరాబాద్ మరియు ముంబైలోని వై.ఎస్. రెడ్డి నివాసాలు, కార్యాలయాలలో సోదాలు నిర్వహించి, అక్రమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను సేకరించింది. ఈడీ అధికారులు గణనీయమైన మొత్తంలో నగదు, బంగారం, మరియు వజ్రాలను స్వాధీనం చేశారు. ఈ కేసులో ఇతర వ్యక్తులు లేదా సంస్థల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన గురించి సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. వాసాయి-విరార్ ప్రాంతంలో దశాబ్ద కాలంగా అవినీతికి పాల్పడుతున్నారు. మురుగునీటి శుద్ధి, డంపింగ్ కోసం ఉద్దేశించిన భూమిపై అక్రమంగా నలభై ఒక్క భవనాలు నిర్మించారు.

ఎప్పుడూ అమ్మకూడని లేదా నిర్మించకూడని భూమిగా దాన్ని నిర్ధారించర్నా. అయితే సంవత్సరాలుగా, బిల్డర్లు నకిలీ అనుమతులను ఉపయోగించి ఈ ఫ్లాట్‌లను కొనుగోలుదారులకు విక్రయించారు. వాసాయి-విరార్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఈ వైఎస్ రెడ్డి కీలకంగా ఉన్నారు. ఈ నిర్మాణాలను కూల్చివేయాలని బాంబే హైకోర్టు కూల్చివేతకు ఆదేశించింది. సుప్రీంకోర్టు దానిని సమర్థించింది.

# మన మిత్రలో మరిన్ని సేవలు

**విజయవాడ, మే 16, :**
ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి దూసుకుపోతుందని మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భారీ పారిశ్రామిక సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. వాళ్లకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు ఆ దిశగానే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఈ మన మిత్ర యాప్ ద్వారా 317 సేవలు అందుతున్నాయి. దీన్ని మే చివరి నాటికి 400కు పెంచాలని అధికారులకు నారా లోకేష్ సూచించారు. ప్రస్తుతానికి ఈ యాప్‌లో రెవెన్యూ శాఖ పరంగా భూరికార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, జన్మ ధ్రువీకరణ పత్రం, పంట నష్టం అంచనా వివరాలు, భూ మార్పిడికి సంబంధించిన వివరాలు, ఐ పట్టా పాస్‌బుక్‌ల వివరాలు లభిస్తున్నాయిగ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల వివరాలు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కోసం దరఖాస్తు, నీటి సరఫరాల, పారిశుద్ధ్యానికి సంబంధించిన ఫిర్యాదులు, గ్రామస్థాయిలో వివిధ పన్నుల చెల్లింపు, భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తుల, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల సేవలు లబిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను చెల్లింపు, నీటి సరఫరా, మురుగు నీటి




నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు, వ్యాపార లైసెన్స్ కోసం దరఖాస్తు, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల సేవలు లభిస్తాయి. విద్యాసంస్థల గురించి సమాచారం, ఉద్యోగాల నోటిఫికేషన్ల సమాచారం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల వివరాలు, ఉన్నత విద్యకు సంబంధించిన సమాచారం, ప్రభుత్వ పాఠశాలలలు, కళాశాలల వివరాలు ఈ మన మిత్ర వాట్సాప్ యాప్‌లో లభిస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రుల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వివరాలు, వైద్య శిబిరాల సమాచారం, టీకాల కార్యక్రమాల వివరాలు, ఆరోగ్య పథకాల గురించి సమాచారం, రక్త నిధి కేంద్రాల వివరాలు లభిస్తాయి. ఆర్టీసీ బస్సుల సమయం, టికెట్ బుకింగ్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమాచారం, వాహన పన్ను చెల్లింపుల వివరాలు లభిస్తాయి.

వీటితోపాటు పోలీస్ శాఖ ఫిర్యాదులు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమాచారం, సామాజిక సంక్షేమ పథకాల గురించి సమాచారం, వ్యవసాయ శాఖకు సంబంధించిన మసాచారం, విద్యుత్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు, చెల్లింపుల వివరాలు ఈ వాట్సాప్ యాప్‌లో లభిస్తాయి.

# మాటల్లో సరే... చేతలేవి...

**నెల్లూరు, మే 16, :**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఈసారైనా నాయకులకు గుర్తింపు, గౌరవం ఇస్తారా? అదే ఇప్పుడు పార్టీలో చర్చ జరుగుతుంది. గత ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు జగన్ నాయకులకు ప్రజల్లో గౌరవం లేకుండా చేసిపారేశారు. వాలంటీర్లను తెచ్చి పెట్టి ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా నిలబెట్టారు. ఏ పని కావాలన్నా వాలంటీర్లే ఉండటంతో ఎమ్మెల్యేలతో పని లేకుండా పోయింది. తానే తాడేపల్లి ప్యాలెస్ నుంచి బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తుండటంతో ప్రజలకు, నేతలకు మధ్య కనెక్షన్ కట్ అయింది. జగన్ తనను చూసి జనం ఓటేయాలన్న అత్యాశతో ఎమ్మెల్యేలను గత ఐదేళ్ల పాటు నొక్కి పెట్టారు. అదే ఆయన ఓటమికి కారణమయింది.మొన్నటి ఎన్నికల్లో జనం వద్దకు వెళ్లి తమకు ఓట్లు వేయాలని అడిగేందుకు కూడా ఎమ్మెల్యేలకు అవకాశం లేకుండా పోయింది. జగన్ ను చూసి ఓటేయాలని అనుకున్నప్పటికీ అంతకు మించి చంద్రబాబు ఎన్నికల హామీలు ఇవ్వడంతో జనం అటువైపు చూశారు. అయినా నలభై శాతం ఓటు బ్యాంకు వైసీపీకి వచ్చింది. ఇదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు తమ సొంత బలంతో ఒక్క చోట కూడా గెలవలేకపోయారు. ఎమ్మెల్యేల ప్రమేయం ఉండి ఉన్నా, కార్యకర్తలతో సంబంధాలు న్నా ఇంత పార్టీకి డ్యామేజీ జరిగి ఉండేది కాదన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. జగన్ ఓటమి పాలయిన తర్వాత కూడా తన పద్ధతిని మార్చుకోలేకపోతున్నారంటున్నారు.అధికారంలో లేకపోయినా వైసీపీ స్థానిక నాయకత్వానికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులను ముందుగానే ఎంపిక చేసి జనంలోకి పంపితే బాగుంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి. అలా జరగకుండా తాను పాదయాత్రతో మళ్లీ వైసీపీని అధికారంలోకి తేవాలని భావిస్తే మాత్రం మరోసారి భంగపాటు తప్పదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జుల నియామకానికి కూడా జగన్ ఆసక్తి చూపడం లేదంటే ఆయన ఇంకా తన ఫొటోను నమ్ముకుని ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్లుంది. అదే జరిగితే ఈసారి ఎన్నికల్లోనూ అరకొర సీట్లు వస్తాయని చెబుతున్నారు. జగన్ తాను మారారని చెబుతున్నప్పటికీ చేతల్లో మాత్రం కనిపించడం లేదన్నది వైసీపీ నేతల నుంచి వినిపిస్తున్న టాక్. మరి జగన్ ఇకనైనా మారి నాయకులకు గౌరవం కల్పిస్తేనే అధికారం అందుకునే అవకాశాలుంటయంటున్నారు.

## కేంద్ర సంస్థల పనులు ఎప్పుడు...
## 41 సంస్థలు....300 ఎకరాలు

**గుంటూరు, మే 16, :** రాజధాని అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అమరావతి రాజధాని ప్రాంతంలో నలభై ఒక్క సంస్థలకు 300 ఎకరాలు పైగా కేటాయించినా పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం అమరావతి రాజధాని పనులను పక్కన పెట్టడంతో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు ముందుకు రాలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది గడుస్తున్నా, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి రాజధాని పనులకు శంకుస్థాపనచేసినప్పటికీ ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు వాటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై మరోసారి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. నేరుగా ఆ యా సంస్థలకు లేఖ రాయాలని భావిస్తుంది.ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని భావిస్తుంది. సత్వరమే కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం పనులు ప్రారంభించకపోతే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశముందని కూడా రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇక్కడ నిర్మాణాలు ప్రారంభించాలంటే వాటికి పరిపాలన సంబంధమైన అనుమతులు ఇవ్వాలి. నిధులు కూడా కేటాయించాలి. అందుకే జాప్యం జరుగుతుందని కూడా కొందరు సమాచారం అందిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీలోని కూటమి పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులతో పాటు కేంద్ర మంత్రులు కూడా ఆయాకేంద్ర ప్రభుత్వ సంస్థలకు వెళ్లి పనుల పురోగతిని గురించి ప్రశ్నిస్తున్నారని తెలిసింది.రాజధాని అమరావతిలోని తుళ్లూరు, రాయపూడి తదితర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలను కేటాయించింది.కొన్ని స్థ నిర్మాణాలు నిలిచిపోయినవి కూడా ఉన్నాయి. రాయపూడి పరిధిలోని జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు కేటాయించిన రెండు ఎకరాలు స్థలం, ప్రహరీ గోడల వరకే పరిమితమైంది. ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ కార్యాలయం భవన నిర్మాణ పనులు కూడా అరకొరగా సాగుతున్నాయి. రాజధాని ప్రాంతంలో మొత్తం 114 ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలకు ప్రభుత్వం 1,277 ఎకరాలను కేటాయించింది. అందులో 41 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, శాఖలు, కార్యాలయాలకు 300 ఎకరాలు కేటాయించింది. స్థలాలు కేటాయించి తొమ్మిదేళ్లు పైగానే అయినా ఇంత వరకూపనులు ప్రారంభించకపోవడంపై విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అమరావతి నిర్మాణాలతో పాటు వీటి పనులను కూడా వీలయినంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలుకోరుతున్నారు. రిజర్వ్ బ్యాంక్, సిఏజి, సిబిఐ, నేవీ, ఆర్మీ, పోస్టల్ , ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసి, ఆయిల్ సంస్థలు, హడ్కో, ఫ్యాషన్ టెక్నాలజీ, కేంద్రీయ విద్యాలయాలు, పలు సాంకేతిక సంస్థలకు స్థలాలు కేటాయించినా నిర్మాణాలు చేపట్టకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి

# జీరో గోల్డ్ బిజినెస్ తో నయా దందా

**విజయవాడ, మే 16, :** జిఎస్టీ పన్నులు లేవు, తరుగు ఉండదు.. కారుచౌకగా ఆభరణాలు అని ప్రచారం చేస్తే ఎవరైనా ఎగబడకుండా ఉంటారా%ొ% సరిగ్గా ఈ బలహీనత మీదే విజయవాడలో జీరో బిజినెస్ గోల్డ్ దందా నడుస్తోంది. తక్కువ ధరకు బంగారం వస్తుందనే ఆశపడితే అసలు బంగారానికే ఎసరు పెడుతున్నారు. బెజవాడలో బంగారం కొనే ముందు ఒకటి పదిసార్లు ఆలోచించి కొనాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిఎస్టీ లేకుండా తరుగు తక్కువకు బంగారం తక్కువ ధరకు లభిస్తుందని కక్కుర్తి పడితే నిలువునా ముంచేస్తారు. విజయవాడ కేంద్రంగా జరుగుతున్న ఈ మోసాలపై ప్రభుత్వ యంత్రాంగాలు కూడా దృష్టి పెట్టడం లేదు.బంగారం అమ్మకాల్లో వ్యాపారులు రకరకాల లెక్కలు చెప్పి ఆభరణాలకు ధరలు నిర్ణయిస్తుంటాయి. వీటి హేతుబద్దత గురించి సరైన నిర్వచనాలు మాత్రం ఉండవు.బడా షోరూమ్‌లలో ఆభరణాలను కొనుగోలు చేస్తే తరుగు, మజూరీ, జిఎస్టీ పేరుతో కొంత అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో విజయవాడ హోల్ సేల్ మార్కెట్‌లలో కొత్త దందా నడుస్తోంది.బంగారు ఆభరణాల విక్రయాల్లో విజయవాడ గవర్నర్‌పేట మార్కెట్‌కు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు ఉంది. జైహింద్ మార్కెట్‌లో ఉండే బంగారు దుకాణాల్లో గుట్టలుగుట్టలుగా ఆభరణాలను విక్రయిస్తుంటారు.షోరూమ్‌లలో ఉండే డిజైన్ల కంటే వందల సంఖ్యలో ఎక్కువగా ఆభరణాలు ఇక్కడ లభిస్తాయి. దీంతో పెళ్లిళ్లు, శుభకార్యాలతో పాటు ఆభరణాలపై పెట్టుబడి పెట్టే వారు హోల్‌సేల్ బంగారు ఆభరణాల దుకాణాల్లో నగలను కొనుగోలు చేస్తుంటారు. ఈ దుకాణాల్లో నిత్యం కోట్లలో టర్నోవర్ జరుగుతుంది.విజయవాడలో బంగారం కొనేటపుడు కాస్త ముందు వెనుక ఆలోచించి కోవాలి. కార్పొరేట్ షోరూమ్‌ల మాదిరి తాము పన్నులు వసూలు చేయమని స్థానిక వ్యాపారులు ప్రచారం చేసుకోవడంతో ఈ దుకాణాల్లో కొనుగోళ్లు భారీగా జరుగుతుంటాయి.విజయవాడకు చెందిన ఓ మహిళ ఇటీవల జైహింద్ కాంప్లెక్స్ హోల్‌సేల్ ఆభరణాల దుకాణంలో సుమారు రూ.5లక్షల ఖరీదు చేసే ఆభరణాన్ని కొనుగోలు చేశారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఆభరణంపై రుణం తీసుకునేందుకు బ్యాంకును సంప్రదించడంతో దాని విలువ మూడు లక్షలకు మించదని తేల్చడంతో షాక్‌కు గురయ్యారు. దీంతో దుకాణదారుడిని ప్రశ్నిస్తే కొనుగోలు చేసిన ఆభరణంలో రాళ్ల బరువు మినహాయిస్తే బంగారం బరువు అంతే ఉంటుందని నింపాదిగా చెప్పారు.52 గ్రాముల బరువు ఉన్న ఆభరణానికి రూ.4.94లక్షల ధరగా నిర్ణయించి, బేరసారాల తర్వాత మహిళకు రూ.4.70 లక్షలకు విక్రయించారు. ఆభరణాన్ని విక్రయించే సమయంలో 52.5 గ్రాముల బరువుకు రూ.9వేల చొప్పున ధర వసూలు చేశారు. బ్యాంకులో ఆభరణం విలువను లెక్కించే సమయంలో ఆభరణంలో దాదాపు 13 గ్రాములు రాళ్ల బరువు ఉన్నట్టు అప్రైజర్ తేల్చాడు. బంగారు ఆభరణంలో ఉన్న 9 పెద్ద పూసలు ఒక్కోటి 0.750 మిల్లీ గ్రాములు, మిగిలిన రాళ్లు కలిపి 12 నుంచి 13 గ్రాముల బరువు ఉంటాయని ఆభరణం అసలు బరువు 38 గ్రాముల్లోపు ఉంటుందని లెక్కించాడు.ఈ వ్యవహారంలో 13 గ్రాముల రాళ్ల బరువుకు కూడా రూ.9వేల చొప్పున బంగారం ధరను వసూలు చేసిన దుకాణదారుడు వారికి జిఎస్టీ రూపంలో లబ్ది కలిగించినట్టు నమ్మించాడు. తాను తరుగు రెండు శాతం లోపు మాత్రమే తీసుకున్నామని చెప్పాడు. కొనుగోలు చేసిన ఆభరణం అసలు బరువు లెక్క మాత్రం చెప్పలేదు. బ్యాంకు లెక్కలో 38గ్రాములు మాత్రమే బరువు తేలడంతో హోల్‌సేల్ లెక్క తేల్చాలని బాధితులు దుకాణం యజమానిని ప్రశ్నించారుబంగారు ఆభరణాల తయారీలో తరుగు 18శాతం వరకు ఉంటుందని, మేకింగ్ ఛార్జీలు, డిజైనింగ్ ఛార్జీలు, జిఎస్టీతో పాటు రాళ్ల బరువు క్యారెట్‌లలో లెక్కించినా తాము హోల్‌సేల్‌గా విక్రయించిన ధర కంటే ఎక్కువే అవుతుందని నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆభరణాల్లో రాళ్ల బరువును విడిగా లెక్కిస్తారని సాధారణ రంగురాళ్లకు బంగారంతో సమానంగా ధర వసూలు చేయరని ప్రముఖ దుకాణాలు స్పష్టత ఇచ్చాయి.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

# ఆపరేషన్ ఆంధ్ర

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అవగతమయినట్లుంది. కిందిస్థాయిలో క్యాడర్ కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, జనంలోకి వెళ్లడానికి జంకుతున్నారన్న అభిప్రాయానికి వచ్చి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నట్లు కనపడుతుంది. ఏడాది పాలన పూర్తయిన నాటి నుంచి ఇక జోరుగా హామీల అమలుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు నిన్న జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో తన మనసులో మాట చెప్పకనే చెప్పారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం వెళ్లినా ఈసారి కూడా పెద్ద సంఖ్యలో స్థానాలను కూటమి సాధించాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.

**ఏడాది పూర్తయిన సందర్భంగా...**

ఈ ఏడాది జూన్ పన్నెండో తేదీ నాటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టి ఏడాది పూర్తవుతుంది. ఆరోజున లక్షమందికిపైగా వితంతు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి తేదీలతో త్వరలో క్యాలెండర్ ను విడుదల చేయనున్నారు. ఏడాది పొడవునా ఏ ఏ హామీలు ఏ తేదీన అమలు చేయనున్నామో స్పష్టంగా ప్రజల ముందు ఉంచి వారికి ఖచ్చితమైన సమాచారం అందచేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. ఆరు నూరైనా ఆరోజు ఆ హామీని అమలు చేసేలా అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను కూడా రెడీ చేసుకునేందుకు అధికారులకు కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించారు.

**మహిళల కోసం..**

మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అయితే ఏ నెల నుంచి అమలు చేస్తారన్నదానిపై ఇంకా స్పష్టత లేకున్నా త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని జిల్లా స్థాయిలో ప్రవేశపెట్టాలని రెడీ అయిపోయినట్లే కనిపిస్తుంది. దీపం పథకం ఇచ్చే మూడు సిలిండర్లకు సంబంధించి ముందుగానే నగదును లబ్దిదారుల ఖాతాలోనే విడుదల చేయాలని నిర్ణయించారు. సిలిండర్ బుక్ చేసుకున్నారా? లేదా? అన్నది సంబంధం లేకుండా ముందుగానే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. చాలా మందికి డబ్బులు పడటం లేదన్న ఫిర్యాదులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల మహిళల ఓటు బ్యాంకు చెక్కు చెదరకుండా ఉండేలా ఇటు ఉచిత బస్సు పథకం, అటు దీపం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు.

**ఎన్నికలు ఎప్పుడొచ్చినా...**

మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంతో పాటు ఓటు బ్యాంకు కూడా పటిష్టపర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పాక్ – భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లే అవకాశముందని కూడా చంద్రబాబు అనుమానిస్తున్నారు. జమిలి ఎన్నికలు 2027 లేదా 2028 లో వచ్చినా ప్రజల్లో అసంతృప్తి లేకుండా అన్ని రకాలుగా గ్రౌండ్ ను చంద్రబాబు ప్రిపేర్ చేస్తున్నారు. ఈ సారి కూటమితోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటునట్లే కనపడుతుంది. ఇలా చంద్రబాబు జగన్ పాదయాత్ర చేసినా తన పథకాలతో జనాన్ని తన వైపునకు తిప్పుకునేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు నిర్ణయించి ఈ మేరకు ముందుకు వెళుతున్నారు.

# ఏఐతో వైద్య రంగంలో అద్భుతాలు.. వేగంగా వ్యాధి నిర్ధారణ, చికిత్సలు





మనిషి తన మేథస్సుతో (ఇంటెలిజెన్స్) నాటి నుంచి నేటి వరకు ఎంతో పురోగతి సాధించగా, ఇప్పుడు కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ఏఐ) ప్రపంచాన్ని మరింత ఆధునికత వైపు తీసుకెళ్లనుంది. ఎన్నో రంగాల్లో కృత్రిమ మేథ అనివార్యం కాగా, ముఖ్యంగా వైద్యం, ఆరోగ్య సంరక్షణ రంగాన్ని ఇది కొత్త పుంతలు తొక్కించనుంది. రోగుల సంక్షేమం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స ఇలా మొత్తంగా ఆరోగ్య నిర్వహణను వేగవంతం, సమర్థవంతంగా మార్చడమే కాదు, సులభతరం చేయనుంది. ఆరోగ్య సంరక్షణ, వైద్య సేవల్లో ఏఐ ఏ విధమైన మార్పులు తీసుకురానుందనే విషయాన్ని గమనించినట్టయితే..

**వ్యాధి నిర్ధారణ పరీక్షలు/కచ్చితమైన చికిత్సలు**

ఒక ల్యాబ్ టెక్నీషియన్ ఒక రోజులో కొన్ని నమూనాలనే పరీక్షించగలడు. కానీ, ఏఐ ఆధారిత మెషిన్లు తక్కువ సమయంలోనే వేలాది పరీక్షలు నిర్వహించగలవు. దీనివల్ల ఫలితాల్లోనూ కచ్చితత్వం పెరుగుతుంది. ఇదంతా ప్రోగ్రామింగ్ పైనే ఆధారపడి ఉంటుంది. ఒక వైద్యుడు ఒక రోగి కోసం మహా అయితే కొన్ని నిమిషాలే కేటాయించగలడు. రోజువారీగా ఉండే రోగుల రద్దీపైనే ఎంత సమయం వెచ్చించడం అన్నది ఆధారపడి ఉంటుంది. క్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు ఎన్నో పరీక్షలు రాస్తుంటారు. అవి చేయించుకుని రిపోర్టులు తీసుకెళ్లి ఇస్తే వాటిని వివరంగా చూసే తీరిక వారికి ఉండదు. వేగంగా పేజీలు తిప్పేసి మందులు రాసి పంపిస్తుంటారు. దీనివల్ల అన్ని సందర్భాల్లోనూ సమస్యలు వెంటనే నయం అవుతాయన్న గ్యారంటీ ఉండదు. కానీ ఏఐ దీన్ని మరింత సమర్థవంతంగా మార్చగలదు. ఒక రోగికి సంబంధించి ఇమేజ్ లు, రికార్డులు అన్నింటినీ ఏఐ పరిశీలించి ఒక చక్కని నివేదిక ఇవ్వగలదు. ఎక్స్ రే, ఎంఆర్ఐ, స్కాన్, సీటీ స్కాన్ ఇమేజ్ లను మనుషులతో పోలిస్తే ఏఐ మరింత కచ్చితంగా విశ్లేషించగలదు. దీనివల్ల మానవ తప్పిదాలను నివారించొచ్చు. ఇమేజ్ ల ఆధారంగా రోగికి ఉన్న సమస్యపై ఏఐ ఇచ్చిన నివేదికను రేడియాలజిస్టులు, ఇతర స్పెషలిస్ట్ వైద్యులు సులభంగా అర్థం చేసుకోగలరు. అవసరమైతే వారు కూడా మరోసారి వేగంగా ఇమేజ్ ను పరిశీలించగలరు. సమయం ఆదాకు తోడు కచ్చితత్వం ఇందులో సాధ్యపడుతుంది.

ఇప్పుడు చాట్ జీపీటీ ఏం చేస్తుందో చూస్తున్నారుగా.. ఏది అడిగినా దాదాపు చక్కని సమాచారాన్ని వేగంగా మన ముందు ఉంచుతోంది. ఆ సమాచారం అంతా కూడా నెట్ పేజీల నుంచే తెస్తోంది. అలాగే, వ్యాధి నిర్ధారణలోనూ ఒక రోగికి సంబంధించిన రికార్డులను ఏఐ టెక్నాలజీ అద్భుతంగా విశ్లేషించి, వేగంగా నివేదిక ఇవ్వగలదు. ఈ నివేదిక ఆధారంగా రోగికి ఎలాంటి చికిత్స అవసరమో డాక్టర్ సులభంగా నిర్ణయించి సూచించగలరు. అప్పుడు డాక్టర్లు, రోగుల సమయం కూడా ఆదా అవుతుంది. వైద్యులపై పని భారం తగ్గుతుంది. దాంతో వారు రోగుల సంరక్షణపై మరింత సమయం వెచ్చించగలరు. మెరుగైన వైద్యానికి వీలు పడుతుంది.

రోగికి సరైన ఔషధాలు సూచించడం చికిత్సలో అత్యంత కీలకమైన అంశం అవుతుంది. ఏఐ దీన్ని మరింత మెరుగుపరుస్తుంది. రోగి జన్యువులు, జీవనశైలి విధానం, వ్యాధి నిర్ధారణ పరీక్షల సమాచారం వీటన్నింటినీ ఏఐ విశ్లేషిస్తుంది. దీంతో విడిగా ఒక్కో రోగికి అనుకూలమైన, సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యపడుతుంది. రోగి డేటా ఆధారంగా భవిష్యత్తులో రాబోయే ఆరోగ్య సమస్యలను కూడా ఏఐ టెక్నాలజీ ముందే గుర్తించగలదు. దీంతో వాటి నివారణపై దృష్టి పెట్టడం వీలవుతుంది.

**ఔషధ పరిశోధన వేగవంతం**

ఒక కొత్త ఔషధాన్ని పరిశోధించి మార్కెట్లోకి తీసుకురావాలంటే కనీసం పదేళ్లు పడుతుంది. ఏఐ దీన్ని మరింత వేగవంతం చేయగలదు. క్లిష్టమైన బయోలాజికల్ డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు. అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కనుక మనిషికి ఉండే పరిమితులు ఉండవు. తప్పులను దాదాపు నివారించొచ్చు. ప్రభావవంతమైన ఔషధాలను గుర్తించగలదు. వాటి సామర్థ్యాన్ని తేల్చగలదు. దీనివల్ల తక్కువ సమయంలోనే సమర్థవంతమైన నూతన ఔషధాలను తీసుకురావడం వీలు పడుతుంది. దీనివల్ల ఎంతో ఖర్చు ఆదా అవుతుంది. ముఖ్యంగా క్లినికల్ ట్రయల్స్ లో డేటా పరంగా ఏఐ ఎంతో ఉపయోగపడుతుంది. ఔషధ పరీక్షల్లో డేటాకు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అంతేకాదు ఒక ఔషధానికి సంబంధించి వేలు, లక్షలాది పేజీల డేటా ఉంటుంది. దీన్ని కచ్చితత్వంతో విశ్లేషించడం మనుషుల కంటే ఈ టెక్నాలజీయే సమర్థవంతంగా, వేగంగా చేయగలదు.

> క్లిష్టమైన డేటాను ఏఐ సులభంగా విశ్లేషించగలదు
>
> మానవ పరమైన తప్పిదాలకు చెక్
>
> వైద్యుల పని సులభతరం
>
> దీంతో రోగులకు మెరుగైన వైద్య సూచనలు
>
> రోగి ఇంటి నుంచే చికిత్సలకు వెసులుబాటు
>
> వేగంగా నూతన ఔషధాల పరిశోధన

**టెలీ హెల్త్**

ఏఐ వల్ల మరో సౌలభ్యం ప్రతిదానికీ రోగి వైద్యుడి వరకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. రోగి తాను ఉన్న చోట నుంచే ఈ టెక్నాలజీ సాయంతో వైద్యుడి సలహా, సూచనలు పొందొచ్చు. టెలీ హెల్త్ రూపంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఈ సేవలను ఏఐ మరింత మెరుగుపరుస్తుంది. వేగవంతం చేస్తుంది. రోగి ఎక్కడున్నా, అతడికి సంబంధించిన తాజా సమాచారం ఏఐ ఆధారిత హెల్త్ గ్యాడ్జెట్ల (పరికరాలు) సాయంతో వైద్యుడికి చేరవేయగలదు. బ్లడ్ షుగర్, బీపీ, ఆక్సిజన్, హృదయ స్పందనలు తదితర ప్యారా మీటర్లు ఎలా ఉన్నదీ వైద్యులకు ఏఐ ఎప్పటికప్పుడు తాజా సమాచారం ఇస్తుంది. దాంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యుడు సూచిస్తాడు. ముఖ్యంగా వైద్య సేవలు అంతగా అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలకు ఇది ఎక్కువ ఉపయోగకరం. మెరుగైన వైద్య సేవలను వేగంగా అందించడంలో సాయపడుతుంది. కొన్ని సర్జరీల తర్వాత రోగులు కోలుకోవడాన్ని ఏఐ టెక్నాలజీతో పర్యవేక్షించొచ్చు. గాయపడిన వారు, వైకల్యంతో బాధపడే వారు చికిత్సతో పొందుతున్న ఫలితాలను వైద్యులు రిమోట్ గా విశ్లేషించడం సాధ్యపడుతుంది.

**నిర్వహణ సులభతరం**

వైద్యుల అపాయింట్ మెంట్, పేషెంట్ రికార్డుల నిర్వహణ, బీమా క్లెయిమ్ ల వ్యవహారాలు చూడడాన్ని ఏఐ చేయగలదు. దీనివల్ల విలువైన మానవ వనరులను ఆదా చేసుకోవచ్చు. దీనివల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.

**వైద్య విద్య కొత్త పుంతలు**

వైద్య విద్యలో ప్రాక్టికల్స్ కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఏఐ దీన్ని నవీకరించగలదు. మెడికల్ కోర్సులు చేసే అభ్యర్థులకు నేర్చుకోవడాన్ని సులభతరం చేస్తుంది. వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ ఇందుకు సాయపడతాయి. ఇవి కాకుండా వైద్య రంగంలో సరఫరా వ్యవస్థ ఎంతో కీలకమైనది. కరోనా వచ్చినప్పుడు సప్లయ్ చైన్ లో సమస్యలను చూశాం. కానీ, ఏఐ టెక్నాలజీ విరివిగా అందుబాటులోకి వస్తే సప్లయ్ చైన్ మరింత బలపడుతుంది. ఔషధాలు, ఉపకరణాలు తదితర ఇన్వెంటరీ నిర్వహణ, అసలు డిమాండ్ ఎంత మేర ఉంది, దానికి తగ్గట్టు వేగంగా సరఫరా ఎలా చేయాలి? అనేది ఏఐతో సులభతరం అవుతుంది. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుంది. వైద్య రంగంలో వస్తున్న మార్పులు, కొత్త వ్యాధులు ప్రబలడం తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరిస్తూ, విశ్లేషిస్తూ ముందస్తు నివారణ చర్యలను సైతం ఏఐ సూచించగలదు.









ప్రగ్యా జైస్వాల్ తన అందమైన యుగంలో మెరుస్తోంది

# కింగ్ 100వ చిత్రంలో మిస్ ఇండియా?



కింగ్ అక్కినేని నాగార్జున తదుపరి లోకేష్ కనగరాజ్ - రజనీకాంత్ ల కూలీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ సినిమా ఆగస్టులో గ్రాండ్ గా విడుదలకు సిద్ధమవుతోంది. లోకేష్ తెరకెక్కించిన విక్రమ్ తరహాలో %-%కూలీ%-% కూడా భారీ మ్యాజిక్ చేస్తుందని అందరూ ఉత్కంఠగా వేచి చూస్తున్నారు. ఇదే సమయంలో నాగ్ తన 100వ సినిమాకి ఘనంగా ప్లాన్ చేస్తున్నారన్న సమాచారం ఉంది. అయితే ఇంతలోనే కింగ్ తో మిస్ ఇండియా వరల్డ్ 2023 విజేత నందిని గుప్తా ఒక ఫోటో క్లిక్ లో కనిపించడం రకరకాల ఊహాగానాలకు దారితీసింది.రాజస్థాన్‌లోని కోటకు చెందిన 21 ఏళ్ల నందిని గుప్తాకు తదుపరి వెండితెర ఆఫర్ క్యూలో ఉందని అందరూ ఊహాగానాలు సాగిస్తున్నారు. అది కూడా నాగార్జున లాంటి టాప్ హీరో సరసన ఈ బ్యూటీ అవకాశం అందుకుందని భావిస్తున్నారు. నాగ్ గతంలో సుస్మితాసేన్, ఐశ్వర్యారాయ్ లాంటి అందాల భామలకు తన సినిమాల్లో అవకాశాలు కల్పించారు. ఇప్పుడు మరో మిస్సుకి అవకాశం కల్పించడం ఖాయమైందని అంతా ఊహాగానాలు సాగిస్తున్నారు. అయితే మిస్ నందిని జాక్ పాట్ అందుకుందా లేదా? అన్నది ఇప్పుడే కన్ఫామ్ గా చెప్పలేం. దీనిపై ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 72వ మిస్ వరల్డ్ పోటీలలో గర్వంగా ప్రాతినిధ్యం వహిస్తున్న మిస్ ఇండియా నందిని గుప్తా భారతదేశానికి మిస్ వరల్డ్ కిరీటాన్ని తీసుకురావడానికి ఒక ప్రయాణాన్ని ప్రారంభించింది. సెప్టెంబర్ 2003లో జన్మించిన నందిని రాజస్థాన్‌లోని కోటాలో నిరాడంబరమైన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన బ్యూటీ. అందమైన గ్రామీణ వాతావరణంలో పెరిగిన నందిని ఆవాలు, చిరుధాన్యాల పొలాలలో ఆడుకుంటూ గడిపింది. కోటలోని సెయింట్ పాల్స్ సీనియర్ సెకండరీ స్కూల్ నుండి ముంబైలోని లాలా లజ్‌పత్ రాయ్ కాలేజీలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ వరకు విద్యా ప్రయాణం సాగింది. పదేళ్ల వయసుకే మిస్ ఇండియా కావాలనే పంతంతో నందిని ఉండేది. నందిని దృఢ సంకల్పం, కృషి 19 సంవత్సరాల వయసులో రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఫెమినా మిస్ ఇండియా 2023 టైటిల్‌ను గెలుచుకోవడానికి దారి తీసింది. ఈ విజయం అనంతరం ఇప్పుడు మిస్ వరల్డ్ పోటీలలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి మార్గం సుగమం చేసింది. మే 13న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకతో మిస్ వరల్డ్ 2025 పోటీ మొదలైంది. అవార్డు విన్నింగ్ డిజైనర్ గౌరంగ్ షా రూపొందించిన సాంప్రదాయ దుస్తులలో నందిని ప్రేక్షకులను ఆకర్షించింది. నాగార్జున- రా కార్తీక్ కాంబినేషన్ లోని నాగ్ 100 చిత్రం గ్యాంగ్ స్టర్ డ్రమా నేపథ్యంలో రక్తి కట్టించనుందని తెలుస్తోంది.



పాతకాలపు చీరలో ఈషా రెబ్బా పాతకాలపు వైబ్

# ఎవరికీ తెలియని విషయాలను వెల్లడించిన బచ్చన్ పాప



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న కింగ్‌డమ్ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. తాను హీరోయిన్ అవాలని డిసైడైనప్పుడు పాటలు వింటూ సీన్స్ ను ఊహించుకునేదాన్నని ఎవరికీ తెలియని విషయాన్ని బయటపెట్టింది బచ్చన్ పాప. తాను ఆ పాటలు వినేటప్పుడే తనక్కూడా ఒక రోజు వస్తుందని, ఆ రోజు తనకంటూ సొంత పాటలుంటాయని, కేవలం బీజీఎం మాత్రమే కాకుండా పాటలకు కూడా తాను ప్రాణం పోస్తానని తనకు తెలుసని చెప్పిన తనకు తాను కలలు కనడం లేదని కూడా అప్పుడే తెలుసని, తానేంటో తనకు తెలుసని చెప్పిన భాగ్యశ్రీ హృదయం లోపల లాంటి సాంగ్ ఇచ్చినందుకు మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ కు థాంక్స్ తెలిపింది. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ పై షూట్ చేసిన ఈ సాంగ్ రీసెంట్ గా రిలీజై అందరి నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. మరీ ముఖ్యంగా సాంగ్ మధ్యలో ఇద్దరి మధ్య వచ్చే డైలాగ్స్ ఆడియన్స్ కు సినిమా కథ గురించి కీలక వివరాలను తెలిసేలా చేస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతుంది. ఈ సాంగ్ మొదట్లో విజయ్ దేవరకొండ పేరు సూరి అని, అతను, భాగ్యశ్రీ లవర్స్ గా నటిస్తున్నారని అర్థమవుతుంది. అయితే వీరిద్దరూ ఏదో పెద్ద మిషన్ కోసం కలిసి ఉన్నట్టు తెలుస్తోంది కానీ ఆ మిషన్ ఏంటనేది మాత్రం తెలియడం లేదు. ఈ సినిమాలో భాగ్యశ్రీ ఓ డాక్టర్ గా కనిపించగా, సూరి జనాలను చంపే బిజినెస్ లో ఉన్నట్టు తెలుస్తోంది. ఇద్దరూ ఒంటరిగా ఉన్నప్పుడు నిరంతరం దూరంగా ఉంటారు కానీ సాంగ్ అయిపోయే టైమ్ కు ఈ జంట ఒకరినొకరు ప్రేమించుకున్నట్టు అనిపిస్తుంది. అనిరుధ్ సంగీతం అందించిన ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, అనిరుధ్, అనుమిత పాటను పాడారు. మే 30న రిలీజ్ కానున్న ఈ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో నాగ వంశీ నిర్మిస్తున్నాడు. ఈ సినిమాపై నిర్మాత నాగవంశీ, హీరో విజయ్ దేవరకొండ ఎంతో కాన్ఫిడెంట్ గా ఉన్నారు.